మహామాయ-15

# కోలాహలం

డిటెక్టివ్ & మిస్టరీ నవల



రచన

కనకమేడల

8 అణాలు

మహాహాస్యం-15

# కోలాహలం

రచన

కనక మేడల

VIGNANA SAHITI
MADRAS-17

ప్రథమ ముద్రణ
మార్చి 1957

పాఠకులకు, ఏజెంట్లకు

ఉగాది సందర్భంగా అనేక మంది పాఠకులు, ఏజెంట్లు మమ్మల్ని, మహా మాయను అభినందిస్తూ ఉత్తరాలు వ్రాశారు. వారికి తిరిగి మా హృదయ పూర్వకాభివందనాల నర్పిస్తున్నాం. ఇప్పటిలాగే ఇకముందు కూడా మా ప్రచురణలను అందరూ ఆదరించగలరని మా నమ్మకం.

వెల
0-8-0

కథానిక మాస పత్రిక వెలువడింది. పాఠకులు చందాదారులుగా చేర వచ్చును. ఇంతవరకు డబ్బు పంపని ఏజెంట్లు త్వరపడి డబ్బు పంపాలి. పత్రిక విషయంలో ఆలస్యం చేయ కలదని మా మనవి.

అభివందనాలతో,

డైరెక్టర్

ముద్రణ
సాహితీ ప్రింటర్స్
మద్రాసు-17

యమదూత మంథరను దూరదర్శి కప్ప గించి తాను మరొక పనిమీద వెళ్తాడు. మంథర దూరదర్శిని మోసగించి పారి పోతుంది. జయంత్ రాయదుర్గానికి, ప్రతాప్ మధ్రరాజ్యానికి అధిపతులుగా వెళ్తారు. మంజుల చివరిసారిగా ప్రతాప్‌ను సంహరించడానికి ప్రయత్నించి విఫలురాలౌతుంది. యమదూత బాబాజీతో కలిసి రాయదుర్గం ప్రాంతానికి వెళ్తాడు. భూగృహంలో రఘువీర్ మహారాజుకు అకస్మాత్తుగా కనిపించిన ఒక యువతి తన వింత చరిత్రను ఆయనకు వినిపిస్తుంది. బాబాజీ కోరికమీద జయంత్ తమ వద్ద బందీగా ఉన్న నకలు నరసింగ భూపతిని ఆయన కప్పగిస్తాడు. తర్వాత—

# 1

ఉదయకాంత అందంగా అలంకరించుకుని వచ్చింది. చెట్ల ఆకులు లేయెండలో మెరిసిపోతున్నాయి. చెట్ల క్రింద మాత్రం నీడగా ఉంది. ఆకాశంలో విహరిస్తున్న సూర్యుడు ఇంకా తన ప్రతాపాన్ని చూపించడంలేదు.

అరణ్యంలో బాబాజీ, యమదూత రెండు గుర్రాలమీద వేగంగా ప్రయాణంచేస్తున్నారు. యమదూత ముందు వెళ్తున్నాడు. అతని వెనుక ఉన్న గుర్రంమీద బాబాజీ

ఉన్నాడు. గుర్రంమీద అతని వెనక నకలు నరసింగభూపతి స్పృహలేని స్థితిలో కట్టి వేయబడి ఉన్నాడు.

ప్రయాణం చాలసేపు జరిగింది. ఇద్దరిలో ఎవరూ మాట్లాడలేదు. ఎవరికి వారు ఏవో విషయాలు ఆలోచించు కుంటూ ప్రయాణంచేస్తున్నారు.

యమదూత ఒకచోట ఆగిపోయాడు. బాబాజీ కూడా తన గుర్రాన్ని ఆపాడు. యమదూత ఎందుకు ఆగాడో అర్థంకాక బాబాజీ అతనివంక ప్రశ్నార్థకంగా చూశాడు. యమదూత కూడా ఆయన వంక చూసి నెమ్మదిగా అన్నాడు.

"మీరు ఇతనిని తీసుకుని మీ ఇంటికి వెళ్లండి. ఇతని ద్వారా మీరు తెలుసుకోవలసిన విషయాలను తెలుసు కోండి. ఇతని విషయంలో మీ రెలా ప్రవర్తించినా నా కిష్టమే. తర్వాత నేను మిమ్మల్ని కలుసుకోడానికి ప్రయ త్నిస్తాను."

"అయితే నువ్విప్పు డెక్కడికి వెళ్తున్నావు?" బాబాజీ అడిగాడు.

"నేను నా స్థావరానికి వెళ్దామనుకుంటున్నాను. నా అనుచరులు చాలమంది ఈపాటికక్కడ చేరుకుని ఉంటారు. నరసింగభూపతి జాడ తెలుస్తుందేమో కనుక్కొమ్మని నేను వాళ్ళను పంపాను. వాళ్ల ద్వారా ఏమయినా విశేషాలు మనకు తెలిస్తే తెలియవచ్చు. ఇంతేకాదు. నా చేతిక్కి చిక్కిన మంథరను దూరదర్శి కప్పగించి నేను మీ వద్దకు వచ్చాను. ఆమెను గుహలోకి తీసుకువెళ్ళమని నేను దూర

దర్శితో చెప్పాను. ఆమెను బాధించి కొన్ని రహస్యాలు తెలుసుకోడానికి అవకాశం ఉంది. అందుచేత......"

యమదూత తన మాటలు పూర్తిచెయ్యకముందే బాబాజీ అన్నాడు.

"సరే, అలాగే కానీ. తర్వాత నన్ను కలుసుకో తప్పకుండా. ఈ లోపుగా నే నితని దగ్గరినించి వీలయినంతవరకు రహస్యాలు తెలుసుకుంటాను."

యమదూత తన గుర్రాన్ని ప్రక్కకు త్రిప్పాడు. బాబాజీ తన అశ్వాన్ని అదలించాడు. రెండు గుర్రాలూ క్రమక్రమంగా దూరం కాసాగినాయి. కాసేపట్లో యమదూత చెట్లచాటున మాయమైపోయాడు.

బాబాజీ తన గుర్రాన్ని హెచ్చరించి శరవేగంతో పోసాగాడు. అలా చాలదూరం ప్రయాణం చేసి చివరికి తన దేవాలయాన్ని చేరుకున్నాడు. గుర్రం ఆయాసంతో నురుగులు క్రక్కుతోంది.

బాబాజీ గుర్రంమీదినించి దిగాడు. ఇంకా స్పృహలేని స్థితిలోనే ఉన్న ఆ వ్యక్తిని గుర్రం మీదినించి దించి భుజాన వేసుకున్నాడు. గుర్రాన్ని అక్కడే వదలి తను దేవాలయంలోకి ప్రవేశించాడు.

అప్పటికి సూర్యుడు పడమటి దిక్కుకు వాలుతున్నాడు. దేవాలయంలో అంత చీకటిగా లేకపోయినా లోపలికి వెళ్లినకొద్దీ క్రమంగా అంధకారం అలముకున్నట్టనిపించ సాగింది.

ఆ దేవాలయంలో దేవతా విగ్రహానికి వెనుకగా ఒక పెద్ద రాతిపలక అమర్చబడింది. ఆ రాతిపలకను తొలగించాడు బాబాజీ. అక్కడినించి లోపలికి మెట్లున్నాయి. ఆయన ఆ వ్యక్తితో సహా మెట్లుదిగి నడవ నారంభించాడు.

ఆ సొరంగ మార్గంలో అలా కొద్దిదూరం వెళ్ళి ఆగిపోయాడు బాబాజీ. ఎడమచేత్తో వెదకి తన దుస్తులలోంచి ఒక తాళపు చెవిని బయటకు లాగాడు. ఎదురుగా ఉన్న తలుపు తాళాన్ని ఆ తాళపుచెవి సాయంతో తెరిచాడు.

తలుపులు తెరిచి లోపలికి అడుగు పెట్టాడాయన. సొరంగ మార్గంలో ఉన్నంత చీకటిగా లేదక్కడ. సన్నని వెలుగు అక్కడక్కడినించీ లోపలికి ప్రసరిస్తోంది.

అది ఒక గది. అంత పరిశుభ్రంగా లేదు. దానిలోంచి ప్రక్కగదిలోకి అడుగుపెట్టాడు బాబాజీ. ఆ పాడుపడిన దేవాలయం క్రింద అంత పెద్ద రహస్య భవనం ఉంటుందని ఎవరూ ఊహించనుకూడా ఊహించలేరు. ఆ భవనంలో ఎన్ని గదులున్నాయో తెలియదు. కాని బాబాజీ రెండు మూడు గదులుదాటి ఒక హాలులో ప్రవేశించాడు.

ఆ హాలులో రెండు మూడు ఆసనాలు, ఒక ప్రక్కగా అందమైన కొయ్య మంచం ఉన్నాయి. బాబాజీ ఆ వ్యక్తిని నేలమీద దించి ఓసారి గట్టిగా గాలి పీల్చుకున్నాడు. గోడకు ఉన్న అల్మారీలోంచి ఏదో పదార్థాన్ని తీసుకువచ్చి ఆ వ్యక్తి ముక్కు దగ్గర ఉంచాడు.

అతనికి క్షణంలో స్పృహ వచ్చింది. కళ్లు తెరచి అన్ని వైపులకీ చూశాడు. ఎదురుగా బాబాజీ తప్ప ఎవరూ

కనిపించలేదు. తానెక్కడ ఉందీకూడా ఆ వ్యక్తికి తెలియ లేదు.

బాబాజీ అతనిని చూసి గంభీరంగా అట్టహాసం చేశాడు.

"ఇప్పుడు నువ్వెక్కడున్నావో నీకు తెలుసా ?" అడిగా డాయన.

"తెలియదు," ఆ వ్యక్తి కొంచెం కంగారుగా సమాధాన మిచ్చాడు.

"యమలోకానికి దారిలో ఉన్నావు. ఇక్కడికి వచ్చిన వాళ్ళు నా ఇష్టంలేనిదే ఎవరూ ప్రాణాలతో బయటికి వెళ్ళలేరు."

ఆ వ్యక్తి మాట్లాడలేదు. మౌనం వహించాడు. నెమ్మదిగా లేచి నిలబడ్డాడు.

బాబాజీ అన్నాడు. "నీకు ప్రాణాలమీద తీపి ఉంటే నువ్వెవరివో చెప్పు."

ఆ వ్యక్తి ఒక క్షణం ఆలోచించి అన్నాడు.

"ఇక అబద్ధాలు చెప్పి ప్రయోజనంలేదు. చేసిన దానికి తగిన ఫలితాన్ని ఎలాగూ అనుభవించక తప్పదు. అందుకే నిజం చెప్పడం మంచిది. నేను భికారిని. కావాలంటే అసలు స్వరూపంలో నేను మీ ముందు నిలబడతాను."

'ఆ విషయం నాకు ముందుగానే తెలుసు. నువ్వెంత వేషం మార్చుకున్నా నువ్వు భికారివని నేను, యమదూత ముందే తెలుసుకున్నాం," బాబాజీ అన్నాడు.

"యమదూతను మీరు అప్పుడిగా భావిస్తున్నట్టున్నారు పాపం. కాని అతను మీ కెంతో అపకారం చేశాడు. ఆ

విషయాలన్నీ చెబితే మీరు నన్ను వదిలి యమదూతను హింసించడానికి పూనుకుంటారు," అన్నాడు బికారి.

"అవన్నీ అప్రస్తుత విషయాలు. యమదూత విషయం నీకంటే నాకే బాగా తెలుసు. ఇప్పుడు నువ్వు చెప్పవలసిన విషయం మరొకటుంది," బాబాజీ అన్నాడు.

"అడగండి. నాకు తెలిసిన విషయాలన్నీ మీకు చెబుతాను," అన్నాడు బికారి.

"నరసింగభూపతి, మాలతి ఎక్కడ బంధింపబడి ఉందీ నీకు తెలిసే ఉంటుంది!" బాబాజీ అన్నాడు.

"మాలతి విషయం నాకు తెలియదు కాని, నరసింగ భూపతి ఎక్కడ బంధింపబడి ఉందీ నాకు తెలుసు," బికారి జవాబిచ్చాడు.

"పోనీ, మాలతిని నా భవనంనించి తీసుకు వెళ్లిం దెవరో తెలుసా?"

"మంత్రి సాధు అనుచరులలో ఎవరో అయి ఉంటారు."

"నువ్వు కాదన్న మాట?"

బికారి తలవంచుకున్నాడు. ఏమీ మాట్లాడలేదు. వెంటనే బాబాజీ విషయాన్ని మార్చి అడిగాడు.

"నరసింగభూపతి ఎక్కడ బంధింపబడీ ఉందీ చెప్పు."

"భూగృహంలో."

బాబాజీ గుడ్లెర్రజేశాడు. "అబద్ధాలు చెబితే ప్రాణాలు తీసేస్తాను. ఆలోచించి నిజం చెప్పు."

"నిజమే చెబుతున్నాను. నాకు తెలిసినంతవరకు మంత్రి సాధు ఆయన నక్కడే బంధించాడు," బికారి దృఢ నిశ్చయంతో అన్నాడు.

"సరే. నేను భూగృహానికి వెళ్తాను. అక్కడ నరసింగ భూపతి ఉందీ లేనిదీ తెలుసుకుంటాను. ఆయన అక్కడ బంధింపబడి లేకపోతే——"

ఆయన తన మాటలు పూర్తి చెయ్యకముందే బికారి అన్నాడు.

"ఆయనను భూగృహానికి దిగువన ఉన్న గదులలో ఎక్కడో బంధించినట్టు మంత్రి నాతో అన్నాడు. కాని అక్కడికి మార్గం నాకు తెలియదు. ఆ గదుల విషయాలూ నా కెన్నడూ చెప్పలేదు. మీ కా గదుల విషయాలు తెలుసా ?"

"నాకు తెలియకపోయినా రఘువీర్ మహారాజుగారికి తెలిసి ఉంటాయి గదా! ఆయన సహాయంతో ఆ గదులన్నీ వెదకుతాం."

"తర్వాత మంత్రి ఆయనను భూగృహంలోంచి మరెక్కడికైనా తీసుకుపోయి బంధించి ఉంటే——" బికారి తన సందేహాన్ని వెల్లగక్కాడు.

"అవన్నీ నేను చూసుకుంటాలే. నువ్వు చెప్పిన మాట నీకు తెలిసినంతవరకు నిజమేకదా!" అన్నాడు బాబాజీ.

బికారి మాట్లాడలేదు. బాబాజీ అతనిని ఆ హాలులో వదలి ప్రక్క గదిలోకి వచ్చాడు. హాలు తలుపులు వెనుక ప్రక్కనించి మూసివేశాడు. తలుపులకు తాళం బిగించాడు.

అక్కడినించి వెనక్కి తిరిగి దేవాలయంలోకి వచ్చాడు. బయట నిలబడి ఉన్న గుర్రం ఆయనను చూడగానే బిగ్గరగా సకిలించింది. వెంటనే ఆయన చూపులు నాలుగు ప్రక్కలకూ తిరిగాయి. కాని ఎక్కడా ఎవరూ కనిపించలేదు. ఆయన నెమ్మదిగా గుర్రం దగ్గరికి నడిచాడు.

## 2

చుట్టుప్రక్కల నిశ్శబ్దంగా ఉంది. యమదూత గుర్రపు డెక్కల చప్పుడుతప్ప ఏమీ వినిపించడంలేదు. మధ్యాహ్నపు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. పక్షిబలగమంతా చెట్లమీద గూళ్ళలో మగత నిద్రలో మునిగిపోయి ఉంది.

యమదూత చాలా దూరం ప్రయాణం చేశాడేమో అలసిపోయి ఉన్నాడు. ఐతే తన గుహను సమీపించ బోతున్నందువల్ల అతని అలసట సగం తీరినట్టుగా కని పిస్తోంది.

కొండ వారగా గుర్రాన్ని ఆపి యమదూత దిగాడు. తన చూపుల్ని నాలుగు ప్రక్కలకూ పోనిచ్చాడు. తన గుహ వైపు అడుగులు వెయ్యడం సాగించాడు.

గుహ తలుపు నెట్టుకుని లోపలికి అడుగు పెట్టాడు యమదూత. లోపలి దృశ్యం అతనిని ఆశ్చర్య చకితుడిని చేసింది.

దూరదర్శి కాళ్లుచేతులు బంధించబడి ఉన్నాయి. అతను స్పృహతప్పి ఒంటరిగా నేలమీదపడి ఉన్నాడు. అతని ముందు కొన్ని పళ్ళు, మంచినీళ్లపాత్ర ఉన్నాయి.

యమదూత గుహ నాలుగువైపులా పరిశీలించి చూశాడు. ఎవరూ కనిపించలేదు. ముఖ్యంగా తనకు కావలసిన మంథర లేదు. తన అనుచరులలో ఎవరూ ఇంకా రాలేదన్న మాట.

యమదూత దూరదర్శి ముక్కుకు ఏదో వాసన చూపించి అతనికి స్పృహ తెప్పించాడు. స్పృహరాగానే దూరదర్శి మగత నిద్రలోంచి మేల్కొన్నవాడిలా అటూ ఇటూ చూశాడు.

ఎదురుగా యమదూత కనిపించడంతో అతను బిక్క మొగం వేశాడు. మంథర పారిపోయి ఉంటుందని అతను గ్రహించాడు. ఆ విషయం చెబితే యమదూత కోపగించుకుంటాడని అతను భయపడ్డాడు. ఇప్పుడేం చెప్పాలా అని తనలో తాను మౌనంగా ఆలోచించుకోనారంభించాడు.

"ఏం జరిగింది?" యమదూత గంభీర స్వరం అతనిని ఆలోచనల్లోంచి మేల్కొలిపింది.

"నేను మంథరను తీసుకుని దాదాపుగా గుహ దగ్గరకు వచ్చాను. ఇంతలో ఒక రౌతు దూసుకుంటూ నా వైపు వచ్చాడు. అతనెవరో అని ఆలోచిస్తూ మౌనంగా నిలబడ్డాను నేను. అతను దిగి నా దగ్గరకు వచ్చాడు. 'యమదూత ఎక్కడ?' అని అడిగాడు. 'ఎక్కడికి వెళ్ళిందీ నాకు తెలియదని చెప్పాను నేను.' అంతే. కాసేపట్లో అతని బలమైన చెయ్యి నా ముక్కు దగ్గరకు వచ్చింది. మరుక్షణంలో నాకు స్పృహతప్పింది. స్పృహవచ్చేసరికి

మిమ్మల్ని చూశాను. ఈ లోపల ఏం జరిగిందో నాకు తెలియదు," దూరదర్శి అబద్ధం చెప్పాడు.

"అయితే మంథర ఏమయిందీ నీకు తెలియదన్నమాట," అన్నాడు యమదూత కాసేపాలోచించి.

"తెలియదు. ఆ వ్యక్తి ఆమెను తన వెంట తీసుకు వెళ్ళి ఉంటాడు," దూరదర్శి అన్నాడు.

'నువ్వింత తెలివి తక్కువగా ప్రవర్తిస్తావని నేననుకో లేదు," అని యమదూత గుహాలోంచి బయటికి వచ్చాడు.

అన్ని వైపులా గంభీరమైన నిశ్శబ్దం. చీమ చిటుక్కుమన్నా వినిపించేట్టుంది. యమదూత గుండె భారంగా ఉంది. చేతికి చిక్కిన మంథర తప్పించుకు పోయింది. ఆమెవల్ల తాను పొందవలసిన లాభం పోగా ఇప్పుడామె తమకు కలిగించే నష్టాల్ని భరించాలి.

ఆమె ద్వారా ఎలాగైనా నరసింగభూపతిజాడ తెలుసుకో వచ్చునను కున్న అతని ఆశలు అడియాసలైనాయి. నిరుత్సాహంగా గుహ ముందు అటూ ఇటూ తిరగసాగాడు.

దూరదర్శికూడా గుహాలోంచి బయటికి వచ్చాడు. అతనిని చూడగానే 'నీకు స్పృహ పోగొట్టిన ఆ వ్యక్తి ఎలా ఉన్నాడు?" అని అడిగాడు యమదూత.

దూరదర్శి కాసేపు ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్న వాడిలా నటించి అన్నాడు.

"అతను మారువేషంలో ఉన్నాడనిపించింది నాకు చూడగానే. నేను అంతకు క్రితం ఆ వ్యక్తిని ఎన్నడూ చూడలేదు. అందుచేత అతనెవరైందీ తెలియదు. బాగా

లావుగా దృఢంగా ఉన్నాడు. పొడుగాటి మీసాలు, జుట్టు ఉంగరాలు తిరిగి వ్రేలాడుతోంది."

యమదూత ఎంత ఆలోచించినా ఈ ఆకారం గల వ్యక్తి ఎవరో అతనికి తెలియలేదు. అందుచేత మరింకేమీ అడగలేకపోయాడు.

"ఎవరో ఈ వైపే వస్తున్నారు," అన్నాడు దూరదర్శి ఆకస్మాత్తుగా ముందుకు చూసి.

యమదూత చూపులు కూడా చెట్ల సందుగా ముందుకు దూసుకుపోయాయి. తన అనుచరులలో ఒకడు గబగబా గుహావైపు రావడం అతను చూశాడు. తానుకూడా ఆతురత కొద్దీ త్వర త్వరగా అడుగులు వేసుకుంటూ అతనికి ఎదురు నడిచాడు.

యమదూతను చూడగానే ఆ అనుచరుడు నమస్కారం చేశాడు.

"ఎక్కడినించీ రావడం?" యమదూత ఆతురతగా అడిగాడు.

"ముందు గుహాలోకి వెళ్దాం పదండి. ఇక్కడ ఏ విషయాలూ ముచ్చటించుకోవడం మంచిది కాదు," అన్నాడు అనుచరుడు.

యమదూత తన అనుచరుడితో వెనక్కి నడిచాడు. కాసేపటికి ఇద్దరూ గుహాలో ప్రవేశించారు. దూరదర్శిని

బయట నిలబడి ఇంకెవరైనా వస్తున్నారేమో చూడమని ఆజ్ఞాపించాడు యమదూత.

అనుచరుడు యమదూత చెవిలో ఏదో రహస్యంగా చెప్పాడు. ఆ మాట వినగానే యమదూత ఆనందంతో ఎగిరి గంతువేశాడు.

"నరసింగభూపతి జాడ తెలిసిందా!" బిగ్గరగా అన్నాడు ఆనందంలో మైమరచి.

"ఔనండి."

"అయితే వెంటనే ఆయన ఉన్న చోటికి ప్రయాణం కావాలి. తక్షణం మేఘాలమీద పయనించినట్టుగా వెళ్ళి అక్కడ వాలాలి," యమదూత అన్నాడు.

"కాని మనం హడావిడిగా మాత్రం బయలుదేరకూడదు. ఫలానా చోటికి వెళ్తున్నామని ఎవరికీ తెలియకూడదు. అలా చేస్తేనే మన ప్రయత్నం సఫలమౌతుంది. లేకపోతే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుంది," అనుచరుడన్నాడు.

యమదూత నెమ్మదిగా అన్నాడు. "ఔను. మనం నెమ్మదిగానే ఆలోచించి ఈ పని చెయ్యాలి. అలా కాకుండా తొందరపడి అన్నిపనులూ చెయ్యడంవల్ల నేనింత వరకు ఆపదలను ఎదుర్కోవలసి వచ్చింది."

దూరదర్శి ఒకసారి యమదూతకేసి చూశాడు. తన విషయంలోనే యమదూతకేదో అసంతృప్తి ఉన్నదన్న విషయం ఆతను గ్రహించాడు.

యమదూత దూరదర్శి వైపు తిరిగాడు.

"మంథర మన చేతుల్లోంచి ఎలాగో తప్పించుకు పోయింది. అందుకిప్పుడు విచారించికూడా ప్రయోజనం లేదు. అయితే ఒక పని మాత్రం చెయ్యాల్సి ఉంది," అన్నాడు.

అదేమిటన్నట్టు ఆతురతగా చూశాడు దూరదర్శి.

కొంచెంసేపు ఆలోచించి యమదూత అన్నాడు.

"మన చేతుల్లోంచి తప్పించుకు పారిపోయిన మంథర ఎవరికో ఒకరికి అపాయం చేయడానికి పూనుకుంటుంది. అలా జరగకుండా మనం వారించాలి."

"అందుకేం చెయ్యమంటారు?" దూరదర్శి అడిగాడు.

"ఇటు నరేంద్రమహారాజుగారికి, అటు రఘువీర్ మహారాజుగారికి, జయంత్ ప్రతాప్‌లకు మంథర మన దగ్గరినించి తప్పించుకుపోయిన వార్త అందచెయ్యాలి," అన్నాడు యమదూత.

"అయితే వెంటనే బయలుదేరి వెళ్తాను," అంటూ దూరదర్శి అక్కడినించి కదిలాడు.

యమదూత తన అనుచరుడివైపు చూసి "అయితే మనం కూడా ఇక బయలుదేరవచ్చుగా," అన్నాడు.

"నాదేమీ ఆలస్యంలేదు," అన్నాడు అనుచరుడు.

అప్పటికి నాలుగడుగులు వేసిన దూరదర్శిని పిలిచాడు యమదూత. తను ఎక్కివచ్చిన గుర్రం గురించి చెప్పి "నువ్వు దానిమీద వెళ్ళు. మేమిద్దరం దగ్గర్లోఉన్న ఊరిలో

రెండు గుర్రాలను కొని ఎక్కి వెడతాం, అవసరమైతే," అన్నాడు.

దూరదర్శి గుహలోంచి గుర్రం దగ్గరకు నడిచాడు. నడచి తాను అంతదూరం ఎలా ప్రయాణం చెయ్యడమా అని ఆలోచిస్తున్న అతనికి ఇప్పుడు ప్రయాణం సులభంగా కనిపించింది.

దూరదర్శి గుర్రం మీద ఎక్కి వెళ్ళిపోగానే యమదూత తన అనుచరుడితో అన్నాడు.

"ఒక వారంలోగా అందరినీ ఇక్కడికి రమ్మన్నాను కదూ నేను! అందుచేతనే నేనిక్కడికి వచ్చాను. మనం ఇక్కడినించి వెళ్ళిపోతే మిగిలిన వాళ్ళు వచ్చి ఇక్కడ నా కోసం ఎదురు చూస్తూ కూర్చుంటారేమో!"

"ఐనా మనం వెళ్ళక తప్పదుగా. వాళ్ళకోసం మనం చూస్తూ కూర్చున్నందువల్ల ప్రయోజనంలేదు. మనం వెళ్ళిపోదాం. వెళ్ళిన పని సఫలమైతే నేను వెంటనే తిరిగివచ్చి ఇక్కడి వాళ్ళను కలుసుకుని సంగతులు చెబుతాను. లేదా మళ్ళీ ఇద్దరం ఇక్కడికి తిరిగి వద్దాం," అన్నాడు అనుచరుడు.

గుహ తలుపు మామూలు ప్రకారం బంధించి ఇద్దరూ అడవిలో ప్రవేశించారు.

"దగ్గర్లో ఉన్న ఊరిలో గుర్రాల వర్తకుడి దగ్గర రెండు గుర్రాలను కొందాం," అన్నాడు యమదూత.

అనుచరుడు సరేనన్నట్టుగా తల ఊపాడు.

"లేకపోతే ప్రయాణం ఆలస్యమౌతుంది. పైగా ఒకవేళ నరసింగభూపతి మనచేత చిక్కినా ఆయనను వెంటనే ఒక

సురక్షిత స్థావరానికి చేర్చడానికి గుర్రాలు అవసరం,'' అన్నాడు యమదూత.

ఇద్దరూ వేగంగా నడుస్తున్నారు. అప్పటికి సూర్యుడు పడమటి దిక్కుకు వ్రాలిపోయాడు. అయినా ఎండవేడిమి ఇంకా పూర్తిగా తగ్గలేదు.

## 3

అడవిలో ఒంటరిగా ప్రయాణం చేస్తున్న మంథర ఆలోచించసాగింది. దూరదర్శిని బంధించి తానెలాగో తప్పించుకు వచ్చింది. ఇక తాను చేయవలసిన పను లేమున్నాయి ?

మహామాయ రాయదుర్గంలో బంధింపబడి ఉంది. మంత్రి కూడా అక్కడే ఉన్నాడు. వాళ్ళిద్దరినీ విడిపించడం తన ప్రధాన కర్తవ్యం. అయితే కిరణ్మయి తండ్రి, మంజుల ఈ పాటికి రాయదుర్గంమీద దండెత్తి ఉంటారు. వీళ్లు వాళ్ళను విడిపించి ఉండవచ్చు. ఒకవేళ విడిపించలేకపోయినట్టయితే మహామాయ వగైరాలను నరేంద్ర మహారాజుగారివద్దకు పంప డానికి మంత్రవాది ఏర్పాట్లు చేయించి ఉంటాడు.

నరేంద్రమహారాజు కోట కెలాగైనా చేరుకోవాలను కుంది మంథర. అక్కడ తనకు శత్రువు లనదగిన వాళ్ళు చాల మంది ఉన్నారు. రాజకుమారులు కూడా ఇప్పు డక్కడే ఉన్నట్టు తనకు తెలిసింది. వాళ్లు కాకపోయినా తాను పగతీర్చుకోవలసిన యువతులు ఇద్దరక్కడ ఉన్నారు.

కిరణ్మయి, లావణ్యా వాళ్లను మాయోపాయంతో తాను సంహరించగలిగితే—

మంథర ఆలోచించుకుంటూ నరేంద్ర మహారాజు కోట వైపు ప్రయాణం సాగించింది. ఎక్కడైనా గుర్రం దొరికితే బాగుండు ననుకుంది కాని అలాంటి అవకాశం లభించలేదు.

చాలాదూరం ప్రయాణంచేసిం తర్వాత మంథర గోదావరీ తీరాన్ని చేరుకుంది. మహానది గోదావరి ప్రశాంతంగా ప్రవహిస్తోంది. చిన్న చిన్న అలలు పోటీపడుతూ పరుగులు తీస్తున్నాయి.

మంథర తలెత్తి ముందుకు చూసింది. ఎదురుగా ఆవలి వైపు నరేంద్రమహారాజు కోట ఎత్తుగా కనిపిస్తోంది. గోదావరీ వాహిని ఆ కోటకు ఒకవైపు సంరక్షకురాలుగా ఉన్నట్టుంది. కోటకు ప్రక్కగా రాజప్రాసాదం ఠీవిగా నిలబడి ఆకాశంలోకి తొంగి చూస్తోంది. దాని ప్రక్క అంతులేని సంఖ్యలో మేడలు, మిద్దెలు, ఇళ్ళు చూడ చక్కగా ఉన్నాయి.

మంథర నదివైపు చూసింది. కొంచెం ఎగువన నది మధ్యగా ఒక పడవ నడుస్తున్నట్టు గమనించింది. ఆ పడవ ఉన్న వైపు గబగబా అడుగులు వేసుకుంటూ నడవ సాగింది.

మంథర మనస్సు తిరిగి ఆలోచనలతో నిండిపోయింది. తాను కోటలోగాని, రాజభవనంలోగాని ఎలా ఉండ గలదు. తన కర్తవ్యాన్ని తానెలా నిర్వహించగలదు!

బాగా ఆలోచించినమీదట ఆమెకొక ఉపాయం తట్టింది. కిరణ్మయి, లావణ్యాలకు చాలామంది దాసీలు ఏర్పాటుచేయబడి ఉంటారు. అందులో ఒక దాసి నెలాగైనా చేజిక్కించుకుని చంపి, ఆ దాసి వేషంలో తాను జనానాను చేరుకోవచ్చు. లేదా, ఏదో విధంగా తన ప్రయత్నం కొనసాగించడానికి తగిన అవకాశం లభిస్తుంది.

మంథర ఆ పడవ ఉన్న ప్రాంతాన్ని చేరుకునే సరికి పడవ దాదాపు ఇవతలి ఒడ్డుకి వచ్చి చేరుకుంది. అందులోంచి ఒక వ్యక్తి దిగి ఒడ్డున గబగబా నడచిపోసాగాడు. మంథర అతనికి కనిపించకుండా ఒక చెట్టు చాటున దాగింది. అతను కొంత దూరం నడిచి చెట్లచాటున కనిపించకుండా పోగానే మంథర పడవదగ్గరికి నడిచి వెళ్ళింది.

వెనక్కి వెళ్ళిపోదామనుకుంటున్న పడవవాడికి మరొక బేరం తగలడంతో ఆనందం కలిగింది. మంథర పడవమీది కెక్కింది పడవవాడు ముందుకు నడపసాగాడు పడవని. పడవ మధ్యగా కూర్చున్న మంథర ఆలోచనలో మునిగి పోయింది.

అన్నివైపులా మసకచీకటి క్రమ్ముకుంది. నది నీటిమీది నుంచి వస్తున్న చల్లనిగాలి శరీరాన్ని పులకరింపజేస్తోంది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. చెట్ల ఆకులు నది నీటిలో పడి అలలతో ఆడుకుంటూ పరుగులు తీస్తున్నాయి.

పడవ అవతలి ఒడ్డుకి చేరుకోగానే మంథర పడవవాడి చేతికి కొంత డబ్బిచ్చి తాను ముందుకు సాగిపోయింది. ఆమె

ఇచ్చిన డబ్బు వంక ఆశ్చర్యంగా చూస్తూ పడవవాడు అక్కడే నిలబడిపోయాడు.

మసక చీకటిలో ఎవరికీ కనిపించకుండా మంథర ఒక చోట తన వేషాన్ని మార్చుకుంది. తర్వాత రాజ భవనం ముందుకు వెళ్ళింది. అంతఃపురం ఎటు ప్రక్క ఉందో తెలుసుకోవడం ఆమె కంత కష్టమనిపించలేదు.

మంథర అంతఃపుర ద్వారంవద్ద చాటుగా నిలబడి లోపలినించి ఎవరైనా వస్తారేమోనని పరీక్షగా చూడ సాగింది. చాల సేపటివరకు ఎవరూ రాలేదు. ఐనా ఆమె ఓపికగా అక్కడే నిలబడింది.

ఇంతలో ఒక దాసి బయటికి రావడం ఆమె కంట బడింది. ఆ దాసి చేతిలో ఏదో పాత్రకూడా ఉంది. మంథర నెమ్మదిగా ఆ దాసి దగ్గరికి వెళ్ళి నిలబడింది

"ఎవరు నువ్వు?" మారు వేషంలో నిరుపేదలా అగు పిస్తున్న మంథర వంక చూసి దాసి అడిగింది.

"నేను ఈ ఊరిదానినేనమ్మా! పెద్ద దానినై పోయాను. నా కొడుకులు, కోడళ్లు నన్ను చూడడం మానేశారు. అందుచేత పొట్ట చేతబట్టుకుని బజారున పడవలసి వచ్చి[illegible]యినా ఊళ్ళో ఎక్కడా పనిదొరక లేదు. అందుచే[illegible] పేరు పొందిన మహారాజుగారి అంతః పురంలో దాసిగా బ్రతుకుదామని వచ్చాను," మంథర దీనురాలిలా అంది.

"అలాంటిదానివి ఇక్కడ నిలబడితే ఏమిటి ప్రయో జనం?" దాసి అంది.

"మరేం చెయ్యమంటారు ?"

"లోపలికి వెళ్ళి రాణిగారితో చెప్పుకోవాలి."

"నన్ను లోపలికి వెళ్ళనిస్తారా. లోపలికి వెళ్ళడానికి నాకు భయంగా ఉంది."

మంథర దాసిని మాటలతో మోసగించినా దాసి కామె మీద జాలి కలిగింది. ఆమె నిజంగా దరిద్రురాలేనని, కూటికి లేక వచ్చిందని భావించింది.

"సరే. నువ్వు ఇక్కడే ఉండు. నేను పనిమీద వెళ్తున్నాను. రెండు నిమిషాలలో తిరిగి వస్తాను. అప్పుడు నిన్ను నాతోపాటు కిరణ్మయిగారి దగ్గరికి తీసుకువెళతాను," అంది దాసి.

"ఆమె దయగలదేనా అమ్మా!" మంథర జాలిగా అడిగింది.

'ఆమె చాలామంచిది. నీ సంగతి వింటే నిన్ను తప్పకుండా దాసీగా నియమిస్తుంది," దాసి అంది.

మంథర మౌనం వహించింది. దాసి తన పనిమీద వెళ్ళిపోయింది. తాను తిన్నగా కిరణ్మయి దగ్గరికే వెళ్ళబోతున్నందుకు మంథరకు ఆనందం కలిగింది.

దాసి కాసేపట్లో తిరిగి వచ్చింది. వాకిట్లో దీనంగా నిలబడి ఉన్న మంథరను తన వెంట అంతఃపురంలోకి తీసుకువెళ్ళింది.

కిరణ్మయి గది చక్కగా అలంకరింపబడి ఉంది. రెండు మూలల ఉంచబడిన దీపాలు జ్వాజ్వల్యమానంగా వెలుగుతున్నాయి. కిరణ్మయి పట్టు పాన్పుమీద పవ్వళించి ఉంది.

ఆమె దగ్గర ఎవరూ లేరు. అంతకు క్రితమే నర్మద, కాళి, లావణ్య ఆమె గదిలోకి వచ్చారు. మాట్లాడుకున్న తర్వాత వాళ్ళు వెళ్ళిపోయారు.

దాసి మంథరను తిన్నగా కిరణ్మయి దగ్గరికి తీసుకు వెళ్ళింది. ఆమెకు జాలి కలిగేట్టుగా మంథర తనకు చెప్పిన విషయాలను చెప్పి వినిపించింది.

కిరణ్మయికి ముసలివేషంలో ఉన్న మంథరమీద జాలి కలిగింది. "మంత్రిగారితో చెప్పి ఈమెను నాకు పరిచారకురాలుగా ఏర్పాటు చేయించమ,"ని ఆజ్ఞాపించింది దాసీని.

మంథర కిరణ్మయి పరిచారకురాలిగా పనిలో ప్రవేశించింది. ఆమెకు వినయ విధేయతలతో సేవచేస్తున్నట్టు నటించసాగింది. కిరణ్మయికి తనమీద నమ్మకం ఏర్పడేట్టు చేసుకో నారంభించింది.

రోజులు గడచిపోసాగాయి. కొత్త దాసి ఏర్పాటు చేయబడిన విషయం మంత్రికి తెలియచేయబడింది. మంథర మీద కిరణ్మయికి అంతులేని అభిమానం ఏర్పడింది. ప్రతి పనికి ఆమెనే నియోగించసాగింది.

మంథర కిరణ్మయిని, లావణ్యను ఎలా మట్టుబెట్టాలా అని ఆలోచించసాగింది. తన మీదికి ఎటువంటి నింద రాకుండా తాను తన కర్తవ్యాన్ని నిర్వహించడ మెలాగా అని ఆమె యోచించింది.

ఆ రోజు లావణ్య, కిరణ్మయి ఒకచోట మేడమీద కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. క్రమంగా సాయంకాల

మైంది. ఆ నాడు దేవీపూజ చెయ్యడానికి ఇద్దరూ నిర్ణయించుకున్నారు. అందుకు ఏర్పాట్లన్నీ జరిగాయి.

మంథర కిరణ్మయి, లావణ్యలతో దేవాలయానికి పూల పళ్ళెరం పుచ్చుకు వెళ్లడానికి ఏర్పాటుచేయబడింది.

మంథర పూల పళ్ళెరంతో మేడమీదకి వచ్చింది.

"ఇక వెళదాం, రండమ్మా! పూజకు వేళయింది," అని ఇద్దరినీ పిల్చింది.

అంతకుముందే ముస్తాబై కూర్చున్న కిరణ్మయి, లావణ్య, మంథరతోపాటు దేవాలయానికి బయలుదేరారు.

దగ్గర్లోనే ఉంది దేవాలయం. అర్చకుడు రాజపరివారానికి ఎదురువచ్చి సగౌరవంగా లోపలికి తీసుకువెళ్ళాడు. పూజ జరిగింది. పూజారి ఫలహారపు పళ్ళెరాన్ని దాసి చేతికిచ్చాడు. దాసి వేషంలో ఉన్న మంథర దానిని తీసుకుని తలుపు దగ్గరకు నడిచింది.

తలుపు చాటున చిమ్మచీకటిగా ఉంది. కిరణ్మయి, లావణ్య అక్కడికి రాగానే మంథర పళ్ళెంలోంచి ఫలహారం తీసి ఆ ఇద్దరి దోసిళ్లలోను ఉంచింది.

ఫలహారం సేవించిన అనంతరం కిరణ్మయి, లావణ్య దేవాలయ మండపంలోకి వచ్చారు. కాని ఎందుచేతనో తల తిరిగిపోసాగింది. గుండెల్లో విపరీతమైన పోటు. కాసేపట్లో ఎక్కడి వాళ్లక్కడే కూలిపోయారు.

దాసి వేషంలోని మంథర కిరణ్మయిని లావణ్యను ఆ స్థితిలో చూడగానే బిగ్గరగా కేకలు పెట్టింది. దేవాలయానికి

బయట ఉన్న రక్షక భటులొకరిద్దరు వెంటనే లోపలికి పరుగెత్తుకు వచ్చారు.

"పూజారి ఇచ్చిన ఫలహారం తినగానే ఇద్దరూ పడిపోయారు. పూజారి ఫలహారంలో విషం కలిపి ఉంటాడు. పూజారిని పట్టుకోండి. నేను రాజవైద్యుడిని పిలుచుకు వస్తాను," అంటూ మంథర బయటకు పరుగెత్తసాగింది.

"ఉండండి," ఎక్కడినించో ఒక కేక అందరికీ వినిపించింది. ఎక్కడినించో కాళి అక్కడ ఊడిపడింది. బయటకు పరుగెత్తుతున్న మంథర వీపులో చిన్న కత్తి వచ్చి గుచ్చుకోవడంతో మరుక్షణంలో నేలమీదకి ఒరిగింది.

"ఆ నీచురాలిని బంధించండి," భటుల నాజ్ఞాపించింది కాళి మంథర వైపు చూపిస్తూ.

భటులు మంథర వైపు దూకారు. ఇదంతా అర్థంకాక పూజారి శిలాప్రతిమలా దేవీవిగ్రహం ముందు నిలబడిపోయాడు. చీకటి అన్ని ప్రక్కలా గాఢంగా అలముకోసాగింది.

రాజవైద్యులు రప్పించబడ్డారు. కాని వాళ్ళు వచ్చినా లాభం లేకపోయింది. కిరణ్మయి, లావణ్య ప్రాణాలు కోల్పోయారని, ప్రయోగించబడిన విషయం చాలా శక్తివంతమైనదని అన్నారు వైద్యులు.

గాయపడిన మంథరను మంత్రిగారి వద్దకు తీసుకుపోవలసిందిగా భటుల నాజ్ఞాపించింది కాళి. మంథర కంగారు పడిపోయింది. తనను కాళి గుర్తించినట్టుగా గ్రహించింది.

ఇంత పనిచేసిన తాను ప్రాణాలమీద ఆశ కోల్పోవలసి వచ్చినా ఇద్దరు ప్రముఖ వ్యక్తుల్ని చంపగలిగినందువల్ల మనస్సుకు కొంత ఊరట కలిగించుకోన నారంభించింది మంథర. కిరణ్మయి, లావణ్యల మరణవార్త కాసేపట్లో నగరమంతటినీ గాలిలా చుట్టివేసింది.

## 4

జోడు గుర్రాలు గాలిలో ఎగిరిపోతున్నట్టుగా ప్రయాణం చేస్తున్నాయి. చెట్లుగాని, పుట్టలుగాని వాటికేమో అడ్డు రావడంలేదు. సూర్యుడు క్రమంగా అస్తాద్రిని చేరుకున్నాడు. సంజకెంజాయలు ప్రపంచాన్ని ఆక్రమించాయి.

యమదూత, అతని అనుచరుడు గుర్రాలమీద వెళ్తున్నారు. అన్నివైపులా నిశ్శబ్దంగా ఉంది. యమదూత మనస్సులో రకరకాల ఆలోచనలు మెదలుతున్నాయి.

భూ్యహానికి సమీపంలోనే ఉన్న పురాన్ని చేరుకున్నారు వాళ్ళిద్దరూ. గుర్రాలను ఊరిబయట చెట్లమధ్య వదలి ఇద్దరూ వేషాలు మార్చుకున్నారు. నెమ్మదిగా ఊరిలోకి ప్రవేశించి కాసేపు అటూ ఇటూ తిరిగారు.

ఊరికి ఒక ప్రక్కగా ఉంది ఒక పెద్ద భవనం. ఆ భవనంలో ఎవరుంటున్నదీ మాత్రం సరిగా తెలియడంలేదు. చూడడానికి భవనం అందంగా ఉంది. ముందు పెద్ద ద్వారం. చుట్టూ ఎత్తయిన ప్రహరీ. సామాన్యులు లోపలికి ప్రవేశించడానికి ఏ మాత్రం అస్కారం లేకుండా ఉంది.

ఇద్దరూ బాగా చీకటి పడేవరకు ఆ భవనం చుట్టూ తిరుగుతూ గడిపారు. తర్వాత భవనం వెనుక ప్రక్కకు చేరుకున్నారు. ఓసారి అటూ ఇటూ చూసి యమదూత ప్రహారీగోడమీదికి దూకాడు. అనుచరుడు కూడా అతని ననుసరించాడు.

ఇద్దరూ భవనానికి వెనుకఉన్న తలుపు దగ్గరకు వెళ్లారు. ఆ తలుపులను తట్టి చూశారు కాని లాభంలేకపోయింది. లోపలి ప్రక్క అవి బంధింపబడి ఉన్నాయి.

యమదూత తలుపులమీద గట్టిగా కొట్టాడు చప్పుడు చేస్తూ. అనుచరుడు ఏదో వస్తువును బయటికి తీసి సిద్ధంగా నుంచున్నాడు. అలా కాసేపు గడిచింది. ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు.

యమదూత రెండడుగులు ముందుకు వేసి ఒక కిటికీ గుండా గదిలోకి చూశాడు. ఆ గదిలో బాగా చీకటిగా ఉంది. అలా రెండు మూడు గదులలోకి చూశాడు.

ఒక గదిలో చిన్న దీపం వెలుగుతోంది. దీపానికి కొంచెం దూరంలో మంచంమీద ఒక స్త్రీ పడుకొని ఉంది. క్రింద నేలమీద ఒకరిద్దరు దాసీలు కాబోలు కూర్చుని ఉన్నారు. అంతకుమించి ఇంకెవరూ ఆ భవనంలో ఉన్న లక్షణాలు కనిపించలేదు.

యమదూత మళ్ళీ వెనక్కి వచ్చి తన అనుచరుడిని కలుసుకున్నాడు. తాను చూసిన విషయాలు అతనికి చెప్పి తిరిగి తలుపులమీద గట్టిగా బాదాడు.

కానేపటికి లోపలినించి అడుగుల చప్పుడు వినిపించింది. ఒక స్త్రీ లోపలినించి "ఎవరు?" అని ప్రశ్నించింది.

యమదూత గొంతు మార్చి "నేనే, బికారిని," అన్నాడు.

మరుక్షణంలో తలుపులు తెరచుకున్నాయి. యమదూత అనుచరుడు ఆ స్త్రీ ముక్కుదగ్గర తన చేతిలోని పదార్థాన్ని ఉంచాడు. ఆమె వెంటనే స్పృహ తప్పి పడిపోయింది.

యమదూత తక్షణం లోపలికి దూకాడు. ఆ భవనం చాలా విశాలమైంది. అందులో ఎన్నో గదులున్నాయి. చాల గదులు దాటి అతను ఆ స్త్రీలు కూర్చుని ఉన్న గది లోకి వెళ్ళాడు.

యమదూతను అకస్మాత్తుగా చూడగానే వాళ్ళు కంగారుగా నిలబడిపోయారు. అతను చిన్నకత్తిని బయటికి లాగి మంచం దగ్గర నిలబడిఉన్న స్త్రీవైపు గురిపెట్టాడు.

"నరసింగభూపతి ఈ భవనంలో ఎక్కడ బంధించబడి ఉందీ చెప్పు. లేకపోతే ప్రాణాలు తీసేస్తాను," అతను అరిచాడు.

"ఇంతకూ మీ రెవరో చెప్పండి," ఆ స్త్రీ భయంతో వణుకుతూ అంది.

"నేను యమదూతను. నరసింగభూపతికోసం వచ్చాను. ఆయన ఎక్కడ బంధించబడి ఉందీ చెప్పు. ఆలస్యం చేయ్యకు," మళ్ళీ అరిచాడు యమదూత.

కొంచెం ధైర్యం చిక్కబట్టుకుని ఆ స్త్రీ అంది.

"ఇక్కడ ఎవరూ బందీలులేరు. ఈ ఇంట్లో అసలు మగవాళ్ళే లేరు."

"అబద్ధం," బిగ్గరగా కేక పెట్టాడు యమదూత. "నరసింగభూపతి ఈ భవనంలో బంధింపబడి ఉన్న సంగతి నాకు బాగా తెలుసు. ఆయన ఎక్కడ ఉందీ చెప్పు. ఒక్క నిమిషం గడువిస్తున్నాను. ఈలోపల చెప్పకపోతే మీ అందరి ప్రాణాలు నిలవవు," అతనన్నాడు.

యమదూత అరుపులకు భయపడిపోయారా స్త్రీలు. ఇంతలో అతని అనుచరుడు కూడా అక్కడికి వచ్చి చేరుకున్నాడు. అతనిని కూడా చూసింతర్వాత ఇక లాభం లేదనుకుని ఆ స్త్రీ అంది.

"సరే. ఆయన ఎక్కడ ఉందీ చూపిస్తా పదండి."

"నువ్విక్కడే ఉండు. నేను ఈమెతో వెళ్లి నరసింగ భూపతిని చూసి వస్తాను," యమదూత అనుచరుడి నాజ్ఞా[illegible]

తాను ఆ స్త్రీ వెనుక బయలుదేరాడు. చీకటిగా ఉన్న ఒక గదిలో ప్రవేశించింది ఆ స్త్రీ. యమదూత ఎందుకైనా మంచిదని తన దగ్గర ఉన్న కొవ్వొత్తినితీసి వెలిగించాడు.

ఆ స్త్రీ గదిమూలగా వెళ్ళింది. గోడవంక చూపిస్తూ అంది.

'ఈ గోడకుఉన్న రాతిపలకను నెట్టితే లోపలికి మెట్లు కనిపిస్తాయి.'

యమదూత ఆ రాతిపలకను నెట్టాడు. లోపలికి మెట్లు కనిపించాయి. ఆమెను ముందు నడవమని యమదూత ఆమె ననుసరించాడు.

ముందొక హాలు. తరువాత వరుసగా నాలుగైదు గదులున్నాయి. అది నేల మాళిగ అని గ్రహించాడు యమదూత. ఆ స్త్రీ ఒక గది ముందుకు వెళ్ళి ఆగిపోయింది. యమదూత కూడా ఆ గది ముందుకు వెళ్ళాడు.

గదిలో బక్కచిక్కి నేలమీద కొన ఊపిరితో పడిఉన్న నరసింగభూపతిని చూడగానే యమదూతకు ప్రాణం లేచి వచ్చినంత పనయింది.

వెంటనే అతను తన దగ్గరఉన్న వస్తువును నేలమీద విసరికొట్టాడు. ఆ వస్తువు పగిలి దానిలోంచి గుప్పున పొగ లేచింది. దాని ప్రభావంవల్ల ఆ స్త్రీ, గదిలోఉన్న నరసింగ భూపతి స్పృహతోల్పోయారు. దాని ప్రభావం తనమీద పడకుండా యమదూత ముందుగానే జాగ్రత్తపడ్డాడు.

వెంటనే అతను ఆ స్త్రీ దుస్తులలో వెదికి ఒక తాళపు చెవులగుత్తిని బయటికి లాగాడు. కష్టంమీద ఒక తాళపు చెవి సాయంతో ఆ గది తలుపులను తెరవగలిగాడు. లోపలికి వెళ్ళి స్పృహతోల్పోయి ఉన్న నరసింగభూపతిని భుజాన వేసుకుని వెనక్కి తిరిగాడు. ఆ స్త్రీ అక్కడే నేల మీద పడిపోయి ఉంది.

కొవ్వొత్తి ఆర్పి తిన్నగా తన అనుచరుడు నిలబడి ఉన్న చోటికి వెళ్ళాడు యమదూత.

"నేను వెళ్ళిపోతున్నాను. నువ్వుకూడా వెంటనే వచ్చేయ్. ఈ స్త్రీలను మాత్రం అదుపులో పెట్టిరా," అని అతను వెనుక వైపుకు గబగబా నడిచాడు. వచ్చిన దారినే వెళ్ళి గోడదూకి భవన ప్రాంగణంలోంచి బయటపడ్డాడు.

బాగా చీకటిగా ఉంది. కొంచెం ప్రొద్దు పోయిందేమో ఊరు సద్దుమణిగింది. అందరూ నిద్రల కుపక్రమించారు. యమదూత చీకట్లో తాము గుర్రాలను వదలి వచ్చిన చోటికి ప్రయాణం సాగించాడు.

యజమానులకోసం ఎదురు చూస్తున్న గుర్రాల దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడతను. ఇంకా అనుచరుడు రాలేదు. తాను నరసింగభూపతిని తీసుకుని ఎక్కడికి వెళ్ళాలో అని అతను ఆలోచించసాగాడు.

ఇంతలో అనుచరుడు కూడా అక్కడకు పరుగున వచ్చాడు.

"ఆ ఆడవాళ్ళను ఏమార్చి పారిపోయి వచ్చాను. ఇక వెళదాం," అన్నాడతను.

ఇద్దరూ గుర్రాలెక్కారు. యమదూత స్పృహ కోల్పోయి ఉన్న నరసింగభూపతిని గుర్రంమీద తన ముందు కూర్చోపెట్టుకున్నాడు. గుర్రాలు వేగంగా ముందుకు సాగాయి.

"మనం ఎక్కడికి వెళ్ళాలి?" అనుచరుడు అనుమానంగా ప్రశ్నించాడు.

"అదే నేనుకూడా ఆలోచిస్తున్నాను," అన్నాడు యమదూత.

కొంతసేపటికి అనుచరుడన్నాడు. "ఈయనను రాయదుర్గం తీసుకువెడితే పోతుందేమో! అక్కడ వర్మన, కళ్యాణి, రఘువీర్ మహారాజు వగైరా ఉన్నారు కాబోలు."

"ఇప్పుడక్కడ ఎవరూ లేరు. అందరూ తలోకచోటా ఉన్నారు. పైగా ఇక్కడినించి చాలా దూరానఉన్న రాయదుర్గానికి ఈయనను గుర్రంమీద తీసుకువెళ్లడం కష్టం, అపాయకరం కూడా," యమదూత ఆలోచిస్తూ అన్నాడు.

"అందుకని మరెక్కడికి తీసుకువెళ్ళాలి?"

"రఘువీర్ మహారాజు భూగృహంలో ఉన్నట్టు విన్నాను. భూగృహం ఇక్కడికి దగ్గరకూడా. కొంసేపట్లో అక్కడికి చేరుకోవచ్చు. నరసింగభూపతిగారిని ఆయన కప్పగించి తర్వాత మన పనులు మనం చూసుకోవచ్చు."

రెండు గుర్రాలూ భూగృహం వైపు మరల్చబడ్డాయి. నరసింగభూపతి లభించిన ఆనందంలో వాళ్ళు గుర్రాలను ఎంత వేగంగా పోనిస్తున్నదీ వాళ్లకే తెలియకుండా ఉంది.

కాసేపు మౌనంగా ప్రయాణం సాగింది. నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ చివరికి యమదూత అనుచరుడిని అడిగాడు.

"నరసింగభూపతి ఆ భవనంలో ఉన్నట్టు నీకెలా తెల్లి సింది?"

అనుచరుడు నవ్వాడు. "నేను భూగృహం ప్రాంతాలకు వచ్చి నరసింగభూపతి జాడ తెలుస్తుందేమోనని చాలా చోట్ల వెదికాను. కాని లాభంలేక పోయింది. నిరాశగా వెనక్కి తిరిగాను. ఈ ఊరిలోకి రాగానే నాకు బికారి ఇంటి సంగతి గుర్తు వచ్చింది. బికారి ఇంటిలో ఉంటే ఎలాగైనా కొన్ని

విషయాలు తెలుస్తాయేమోననే ఆశతో ఆ భవనంలోకి వెళ్ళాను. ఇదే స్త్రీలు కూర్చుని కబుర్లు చెప్పుకుంటు న్నారు. చాటుగా నిలబడి విన్నాను. వాళ్ల సంభాషణల మధ్య నరసింగభూపతిని గురించిన చర్చకూడా వచ్చింది. దానినిబట్టి నరసింగభూపతి ఆ భవనంలోనే బంధింపబడి ఉన్నాడని నిర్ణయించుకున్నాను. తిన్నగా మన గుహ దగ్గరికి మిమ్మల్ని కలుసుకోడానికి వచ్చేశాను," అన్నా డతను.

యమదూత అంతులేని ఆనందంతో మందహాసం చేస్తూ అన్నాడు.

"పరిస్థితులన్నీ చక్కబడిం తర్వాత నువ్వు చేసిన సహా యానికి కోరిన బహుమతి ఇస్తాను."

కాసేపటికి ఇద్దరూ భూగృహం సమీపానికి వచ్చేశారు. అప్పటికి దాదాపు అర్ధరాత్రి కావస్తోంది.

తన గుర్రంమీదినించి నరసింగభూపతిని దించి భుజాన వేసుకున్నాడు యమదూత. ఇద్దరూ ఆ నిశ్శబ్ద వాతా వరణంలో నెమ్మదిగా భూగృహం లోపలికి ప్రవేశించారు. సొరంగ మార్గాన నడచివెళ్తున్న వాళ్ళిద్దరికీ ఎవరూ కనిపించ లేదు.

ప్రధాన ద్వారం దగ్గర మాత్రం కొందరు భటులు ఉన్నారు. యమదూతను గుర్తుపట్టి వాళ్లు ఇద్దరినీ లోపలికి వెళ్ళనిచ్చారు.

"మహారాజుగారు లోపల ఉన్నారా?" యమదూత ఒక భటుడిని అడిగాడు.

"ఉన్నారు," అతడు సమాధాన మిచ్చాడు.

ఇద్దరూ మళ్లీ సొరంగ మార్గంలో ముందుకు సాగారు, రఘువీర్ మహారాజు గదివైపు. నిశ్శబ్దంతోపాటు చీకటి కూడా అన్ని దిక్కులా ఆవరించి ఉంది.

## 5

నరేంద్రమహారాజు కొంచెం కంగారుగా మహామంత్రి కోసం కబురు చేశాడు. తంత్రవహి మందహాసం చేస్తూ మహారాజుగారి ఎదటికి వచ్చి కూర్చున్నాడు. మంత్రి మందహాసంలో ఏదో నిగూఢభావం ఉండి ఉంటుందని గ్రహించిన మహారాజు మనస్సుకు కొంత ధైర్యం కలిగింది.

ఇంతలో నర్మద కూడా ఆతురతగా అక్కడికి వచ్చింది.

"ఏమిటీ దారుణవార్త? ఆమె అడిగింది, మంత్రివైపొకసారి, మహారాజువైపొకసారి చూసి.

"కలవరపడకు. పరిస్థితులన్నీ బాగానే ఉన్నాయి. అన్ని విషయాలూ కాసేపటిలో తెలుస్తాయి," అన్నాడు మంత్రి తంత్రవహి.

నర్మద కీమాట వినగానే ఆశ్చర్యం కలిగింది. ఆమె మనస్సులో ఆలోచనలు చెలరేగాయి. కిరణ్మయి, లావణ్యా క్షేమంగానే ఉన్నారన్నమాట! అయితే వాళ్ళు చనిపోయారన్న వార్త తనకెలా అందింది! అంతా విచిత్రంగా ఉంది. ఇందులో ఏదో ముఖ్యమైన రహస్యం ఉండి ఉండాలి. నర్మద ఆలోచిస్తూ మౌనంగా కూర్చుంది.

నరేంద్రమహారాజుకు సంగతేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం ఎక్కువైంది. ఆయన ఏదో ప్రశ్నించబోతున్న సమయంలో కాళి అక్కడికి వచ్చింది. మంత్రి ఆమె వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

“మంథరను బంధించాం. పాపం వాళ్ళిద్దరూ మాత్రం ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది,” అంది కాళి.

ఆమె మాటలలోని భావం తెలియక మహారాజు, నర్మద తికమక పడ్డారు. ఇద్దరి చూపులూ ఆతురతకొద్దీ కాళివైపు తిరిగాయి. ఆమె మహామంత్రి వంక చూసింది.

“కిరణ్మయిని, లావణ్యను కూడా ఇక్కడికి తీసుకువస్తే బాగుంటుంది,” మంత్రి అన్నాడు.

కాళి వెళ్ళిపోయింది తన పనిమీద. మహారాజు మందహాసం చేస్తూ అడిగాడు.

“ఇదంతా వింతగా ఉంది. అసలేం జరిగింది? ఇప్పుడు చనిపోయిం దెవరు? కిరణ్మయి, లావణ్య ఎక్కడ ఉన్నారు. మంథర ఇక్కడికెలా వచ్చింది?”

మంత్రి సమాధానంగా అన్నాడు.

“ఈ మధ్య చాలా గమ్మత్తయిన విషయాలు జరిగాయి. మీకు తెలియచేయడానికి కూడా తగినంత వ్యవధి లభించకముందే వాటి ఫలితం బయట పడింది.”

మంత్రి ఆగి ఓసారి ఇద్దరివంకా చూసి మళ్ళీ మొదలుపెట్టాడు.

మంథర, కిరణ్మయి తండ్రితోసహా “రాయదుర్గంమీదకి దండయాత్ర బయలుదేరింది. కాని దారిలో ఆమెను

చేజిక్కించుకున్నాడు యమదూత. అత నా మెను దూరదర్శి - కప్పగించి మరొక పనిమీద వెళ్ళాడు. అయితే మంథర దూరదర్శిని వంచించి తప్పించుకుపోయింది. అక్కడినించి తిన్నగా మన నగరంలోకివచ్చి కిరణ్మయి దగ్గర కొత్తగా దాసిగా చేరింది. కిరణ్మయికి మరొక కొత్త దాసి ఏర్పాటు చేయబడినట్టు నాకు తెలియచేయబడింది. నేను మామూలు ప్రకారం విని ఊరుకున్నాను.

"అయితే నిన్న దూరదర్శి నా దగ్గరికి వచ్చాడు. యమదూత పంపినట్టుగా చెప్పి మంథర విషయంలో హెచ్చరించాడు. అంతటితో ఆ కొత్త దాసిమీద నాకు అనుమానం ఏర్పడింది. మంథర మారువేషంలో కిరణ్మయి దాసిగా చేరి ఉంటుందని నా అంచనా. ఆ విషయం రూఢిగా తెలుసుకోవడ మెలాగా, అని ఆలోచించాను. తర్వాత కాళిని పిల్చి సంగతంతా చెప్పాను. ఆ దాసిమీద ఒక కన్ను వేసి ఉంచమన్నాను.

"అప్పటికీ నాకు అనుమానంగానే ఉంది. ఆ దాసిని పరీక్షించి తీరాలనుకున్నాను. కాళితో ఒక పన్నాగం పన్నించాను. మన దాసీలలో ఇద్దరికి కిరణ్మయి లావణ్యల వేషాలు వేయించి వాళ్ల గదులలో కూర్చోపెట్టాం. దాసీలకు అన్ని సంగతులూ చెప్పి జాగ్రత్తగా ఉండమని హెచ్చరించాను. కిరణ్మయి, లావణ్య ఏదో నెపంతో మరొక చోటికి తీసుకుపోబడ్డారు.

"పూజకు మంథరతోపాటు కిరణ్మయి, లావణ్యా వేషాలలో ఉన్న దాసీలు వెళ్ళారు. చీకటిలో వాళ్ల మారు మారువేషాలను మంథర ఏ మాత్రం గుర్తుపట్టలేకపోయింది."

మంత్రి చెబుతున్న సమయంలో కిరణ్మయి, లావణ్యలను వెంట పెట్టుకుని కాళి అక్కడికి వచ్చింది. ఆ ఇద్దరినీ చూడగానే నర్మద ఆనందంతో అపాయం తప్పినందుకు వాళ్ళను అభినందించింది.

"దేవాలయంలో మంథర ఏం చేసిందీ కాళి చెబుతుంది," అన్నాడు మహామంత్రి.

"మంథర ఏం చేస్తుందో చూడాలని నేను కనిపెట్టుకు కూర్చున్నాను. ఎవరికీ తెలియకుండా దేవాలయ మండపంలో దాగి ఉన్నాను. పూజారి మంథర చేతికి ఫలహారం అందించడం చూశాను. తర్వాత కిరణ్మయి, లావణ్యా వేషాలలో ఉన్న వాళ్ళకు మంథర ఫలహారం ఎప్పుడిచ్చిందీ నేను చూడలేకపోయాను. ఆతర్వాత ఫలహారం సేవించిన ఇద్దరూ మండపంలో నేలకొరిగిపోవడం నేను చూశాను. ఇది మంథర చేసిన పనికి ఫలితమని గ్రహించాను," అంది కాళి.

"అయితే మంథర ఫలహారంలో విషం ఎప్పుడు కలిపి ఉంటుంది?" నర్మద అడిగింది.

"అదే నేను గమనించలేకపోయాను. అయితే పూజారి ఫలహారం అందించగానే మంథర ఒక మూలకు వెళ్ళడం నేను చూశాను. అక్కడ బాగా చీకటిగా ఉంది. అప్పుడే ఫలహారంలో విషం కలిపి ఉంటుందని నా అనుమానం," కాళి సమాధానంగా అంది.

"మే మందరం ఉండగా మంథరను కిరణ్మయి, లావణ్యాల మీద పగ ఎందుకో?" చిరునవ్వు నవ్వుతూ అంది నర్మద.

"మాకు అందరూ శత్రువులే," కిరణ్మయి వ్యంగ్యంగా అంది.

విషయాన్ని మారుస్తూ నరేంద్రమహారాజు అడిగాడు.

"మంథరను ఎక్కడ బంధించారు?"

"తూర్పువైపు ఖైదుగదులలో ఎక్కడయినా ఉంచడం కోసం సైనికులు ఆమెను తీసుకువెళ్ళారు," కాళి జవాబిచ్చింది.

'ఈ సందర్భంలో యమదూత మంథరను గురించి కబురు చెయ్యడం మంచి దైందన్న మాట," అంది నర్మద.

"తప్పకుండా. అతనెంతో తెలివైన పని చేశాడు," అన్నాడు మహామంత్రి.

"సాధారణంగా అతను పొరపాట్లు చేసే మనిషి. అలాంటి వాడు ఇప్పుడింత తెలివైన పని చేశాడంటే ఆశ్చర్యంగానే ఉంది," నర్మద అంది.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. మళ్ళీ నర్మద అంది.

"నేనిక్కడికి వచ్చిన పని ఐపోయింది. త్వరలోనే తిరిగి వస్తానని భవానికి, అక్కకు చెప్పాను. ఇక మహారాజుగారి వద్ద సెలవు పుచ్చుకోవాలనుకుంటున్నాను."

నరేంద్రమహారాజు నర్మద వంక సంతోషంగా చూసి అన్నాడు.

''మీ రందరూ నా కుమారులకు, నాకు చేసిన సహాయం మరువరానిది. అందుకు మేం కృతజ్ఞత తెలుపుకోవలసి ఉంది."

''మీరలా అనకండి. స్వార్థంకోసమే మేం ఏ పనులైనా చేశాం. దీనివల్ల మీకూ ప్రయోజనం కలిగిందంటే అది మా అదృష్టం," నర్మద అంది.

మహారాజు మాట్లాడలేదు. నర్మద మహామంత్రి వంక చూసి అంది.

''మాకు ప్రయాణానికి ఏర్పాటుచేయించవలసిందిగా కోరుతున్నాను.

తంత్రవహి కాళివైపు తన చూపులు పోనిచ్చి అన్నాడు.

''కాళి కొంతకాలం ఇక్కడ ఉండడం మంచిదిగా భావిస్తున్నాను."

"అందుకు నా అభ్యంతర మేమీలేదు," అంది నర్మద.

''మీ ఆజ్ఞను శిరసావహిస్తాను." అంది కాళి మంత్రి వంక చూస్తూ.

మంత్రి అక్కడినించి లేచి బయటికి వెళ్ళాడు. మహారాజుకూడా విశ్రాంతి మందిరంలోకి వెళ్ళాడు. నర్మద, కిరణ్మయి, లావణ్య, కాళి మాత్రం అక్కడ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

''మీ సోదరిని చూడాలని చాలా కుతూహలంగా ఉంది," అంది కిరణ్మయి నర్మదతో.

"అదొక పెద్ద సమస్యకాదుగా," అంది నవ్వుతూ నర్మద.

కాసేపు నిశ్శబ్దంగా గడచింతర్వాత నర్మద మళ్ళీ అంది.

"ఒకసారి నా భవనానికి వస్తే అందరం కులాసాగా కొద్ది రోజులు గడపవచ్చు."

"ఆ రోజులకోసమే ఎదురు చూస్తున్నాను," అంది కిరణ్మయి.

"ఆ రోజులకోసం ఎదురుచూడ నక్కరలేదు. తల్చుకుంటే ఇప్పుడైనా ఆ రోజులు వచ్చి మన ముందు వాలతాయి," అంది నర్మద.

"మీరంతా భూగృహానికి వస్తే ఓసారి అక్కడ కలుసుకోడానికి ఎక్కువ అవకాశాలుండవచ్చు," అంది కాళి.

"అదంతా రఘువీర్ మహారాజుగారి ఇష్టంమీద ఆధారపడి ఉంటుంది," నర్మద సాలోచనగా అంది.

తిరిగి ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. ఎవరి ఆలోచనలలో వాళ్ళు మునిగిపోయారు. నర్మద తన ప్రయాణాన్ని గురించి ఆలోచిస్తోంది. కిరణ్మయి, లావణ్యల మనస్సుల్లోని విషయాలను ఊహించడం సులభమే కాని కనిపెట్టడం కష్టం. ఆ ప్రశాంత వాతావరణంలో భయంకర సంఘటనల అనంతరం అందరూ మౌనంగా కూర్చున్నారు.

## 6

బాబాజీ గుర్రంమీదికి ఎక్కబోయే సరికి వెనకనించి ఎవరో పిల్చినట్టనిపించింది. వెంటనే వెనక్కి తిరిగి చూశాడు. ఒక వ్యక్తి తనవైపే రావడం గమనించాడాయన.

ఆ వ్యక్తి బాబాజీకి నమస్కారంచేసి ఒక ఉత్తరాన్ని ఆయన కప్పగించాడు. ఆ ఉత్తరం మడత విప్పి లోలోపలే చదువుతున్నాడు బాబాజీ. అంతే. ఆయన ముఖంలో ఆనందరేఖలు పొడసూపాయి.

ఒకసారి ఆ భటుడివంక పరీక్షగా చూసి బాబాజీ అన్నాడు.

"నేనూ అక్కడికే బయలుదేరదామనుకుంటున్నాను. ఇంతలో నువ్వు వచ్చావు. వెళదాం పద. నీకు గుర్రం ఉందా?"

"ఉంది. కొంచెం దూరాన దిగి నడచి వచ్చాను," ఆ వ్యక్తి అన్నాడు.

"సరే. నీ గుర్రంమీద నువ్వు రా. ఇద్దరం కలిసే వెళదాం," అని బాబాజీ తన గుర్రాన్నెక్కాడు.

ఈ సమయంలో ఆయన ఆనందానికి హద్దులు లేకుండా ఉన్నాయి. ఎప్పుడు వెళ్లి రఘువీర్ మహారాజుగారి దగ్గర వాలదామా అని అతని మనస్సు ఆరాట పడిపోసాగింది.

ఆ ఉత్తరం ఆయన వ్రాసి పంపాడు. అందులో మాలతి క్షేమంగా తనవద్ద ఉన్నట్టు, ఒకసారి వచ్చి మాట్లాడి పొమ్మని ఆయన వ్రాశాడు. అందుచేతనే బాబాజీ ఆనందంతో పొంగిపోతున్నాడు. చాలాకాలం తర్వాత తాను తన ప్రియకుమార్తెను తిరిగి కలుసుకోబోతున్నాడు.

ఆ వచ్చిన వ్యక్తితోసహా బాబాజీ భూగృహానికి బయలుదేరాడు. ఆయన వెళ్ళేసరికి రఘువీర్ మహారాజు భూగృహంలోని తన గదిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు.

బాబాజీని చూడగానే ఆయన ఎదురు వచ్చి కుశల క్షేమాలడిగాడు. చిరకాలానికి ఆనందమయ వాతావరణంలో కలుసుకున్న ఇద్దరు మిత్రుల హృదయాలెలా ఉంటాయో చెప్పనక్కరలేదు.

బాబాజీని చూడగానే మాలతి పరుగున వచ్చి ఆయన కాళ్ళమీద పడింది. కన్నీటితో కాళ్లను కడిగివేసింది. అవి అశ్రుబిందువులో, ఆనందభాష్పాలో మరి!

అనేక కష్టాల అనంతరం కూతురిని క్షేమంగా చూడగలిగినందుకు బాబాజీ కళ్లలోకూడా ఆనందబాష్పాలు నిండాయి. తర్వాత రఘువీర్ మహారాజు మాలతి విషయాలు క్లుప్తంగా ఆయనకు వివరించి చెప్పాడు.

తరువాత చాలసేపు బాబాజీ మహారాజుతో మంత్రి సాధు, బికారి, మహామాయ కలిసి చేసిన దుష్కృత్యాలను గురించి చర్చించాడు. ఇంత కాలానికైనా ఇన్ని ఆపదల అనంతరం పరిస్థితులు సవ్యంగా ఉన్నందుకు చివరికిద్దరూ ఆనందించారు.

కబుర్లతో ప్రొద్దుపోయింది. చివరికి ముగ్గురూ నిద్రకుపక్రమించారు. మనస్సుల నావరించిన విచారాలు ఒక్కొక్కటిగా తొలగిపోతూండడంవల్ల అందరూ మైమరచి నిద్రపోసాగారు.

అర్ధరాత్రి. చీమ కదలినా వినిపించే నిశ్శబ్ద వాతావరణంలో ఎవరివో అడుగుల చప్పుడు వినిపించింది అప్పుడే మెలుకువ కలిగిన మాలతికి. ఎందుకో ఆమె కంగారు పడింది. మళ్ళీ ఏదైనా ఆపద తమకు కలుగుతుందేమోనని

సంశయంతో ఆమె తండ్రి దగ్గరకు వెళ్లింది. ఆయన మంచి నిద్రలో మునిగిపోయి ఉన్నాడు.

ఆయనను నిద్రనుండి లేపి మాలతి అడుగుల చప్పుడును గురించి చెప్పింది. బాబాజీ కంగారుగా లేచి సొరంగ మార్గాన ముందుకు సాగాడు. తన కెదురుగా వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఎవరో చీకట్లో సరిగా తెలియకపోవడంవల్ల గోడవారగా నిలబడి పరీక్షించాడు.

చివరికి యమదూతను గుర్తుపట్టాడాయన. ఎత్తుగా, బలంగా ఉన్న అతని భుజంమీద ఉన్నదెవరో మాత్రం ఆయనకు తెలియలేదు. అతని వెనుక నడచి వస్తున్న ఆ వ్యక్తి ఎవరో అనుచరుడై ఉంటాడని బాబాజీ గ్రహించాడు.

దగ్గరికి రాగానే బాబాజీ యమదూత కెదురుగా వెళ్లాడు. అక్కడ అకస్మాత్తుగా ఆయనను చూడగానే యమదూత ఆశ్చర్యంగా ఆగిపోయాడు. బాబాజీ యమదూత భుజంమీద ఉన్న వ్యక్తివైపు పరీక్షగా చూశాడు.

"నరసింగభూపతిని ఎలాగో పట్టుకోగలిగావే?" ఆనందంగా అన్నాడు బాబాజీ.

"ఔను," అన్నాడు ముక్తసరిగా యమదూత.

"రఘువీర్ మహారాజుకు ఈ విషయం తెలిస్తే ఆయన కూడా ఎంతో ఆనందిస్తారు. లోపలికి వెళదాం పద," బాబాజీ అన్నాడు.

ముగ్గురూ రఘువీర్ మహారాజు గదిలో అడుగు పెట్టారు. ఆ చప్పుడికి ఆయన లేచి కూర్చున్నాడు. ఓసారి నాలుగు ప్రక్కలా కలయచూశాడు. చిన్న దీపపు కాంతిలో

అస్పష్టంగా ఉన్న మూడు ఆకారాలను ఆయన గుర్తు పట్టగలిగాడు.

యమదూత భుజంమీదినించి క్రిందికి దింపిన నరసింగ భూపతిని చూడగానే ఆయన ఆశ్చర్యంగా ఓసారి అందరి మీదికీ తన చూపులు పోనిచ్చాడు.

"నరసింగభూపతిగారిని తీసుకువచ్చాను. ఆయనను మీ దగ్గర సురక్షితంగా ఉంచి నామీద ఆరోపించబడిన నేరాన్ని తొలగించుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాను," అన్నాడు యమదూత రఘువీర్ మహారాజుతో.

"ఈయనను ఎక్కడినించి విడిపించి తీసుకువచ్చావ్?" అని అడిగాడు మహారాజు ఆతురతక్కొద్దీ.

యమదూత జరిగిన సంగతులన్నీ వివరించి చెప్పాడు. బాబాజీ, మాలతికూడా ఈ సంగతులు కుతూహలంతో విన్నారు.

"అయితే ఈయన బికారి ఇంట్లోనే బంధింపబడి ఉన్నాడన్నమాట. బికారి నాతో అబద్ధం చెప్పాడు భూగృహంలో బంధించబడి ఉన్నాడని చెప్పాడు. వెళ్ళంతర్వాత ఆ దుర్మార్గుడి పని పట్టాలి," బాబాజీ అన్నాడు.

"బికారి మీదగ్గర ఉన్నాడా?" మహారాజు ప్రశ్నించాడు.

"ఔను. నేనూ యమదూత వెళ్ళి అతనిని రాయదుర్గం నించి తీసుకువచ్చాం. నరసింగభూపతి వేషంలో వచ్చి మిమ్మల్ని మోసగించడానికి ప్రయత్నించిందతనే. ఇప్పుడు

అబద్ధం చెప్పి నన్నుకూడా మోసగించాడు,'' బాబాజీ జవా బిచ్చాడు.

యమదూత ముందే మాలతిని చూశాడు. నరసింగభూపతితోపాటు, మాలతికూడా లభించడం అతని కావందాన్ని కలిగించింది. ఆమె ఎక్కడ ఉందో తెలుసుకోవాలనుకుం టున్న యమదూతకు బాబాజీ మాలతికి సంబంధించిన విషయాలన్నిటినీ చెప్పి వినిపించాడు. యమదూత చూపులు ఎన్నో కష్టాల అనంతరం కనిపించిన మాలతిమీదికి పోయాయి.

రఘువీర్ మహారాజు అనుజ్ఞ మీద యమదూత నేలమీద పడిఉన్న నరసింగభూపతికి స్పృహ తెప్పించాడు. ఆయన స్పృహరాగానే నీరసంగా కళ్ళు తెరచి ఓసారి చుట్టూ కలయచూశాడు. ఆ వాతావరణం ఆయనను ఆశ్చర్యంలో ముంచింది.

తాను ఇంతకాలం పడిఉన్న చీకటిగది కాదది. ఇక్కడ తనకు పరిచితమైన ముఖాలెన్నో కనిపిస్తున్నాయి. బాధలతో వశం తప్పిపోయిన ఆయన మనస్సుని ఒక్కసారిగా ఆనందపు పొంగు ఆవరించింది.

తన చుట్టూ నిలబడి ఉన్న రఘువీర్ మహారాజును, బాబాజీని, మాలతిని, యమదూతను చూడగానే ఆయన కాసేపు మైమరచిపోయాడు. కాసేపటికి తెప్పరిల్లి మహారాజువైపు ప్రశాంత దృష్టితో చూశాడు.

''ఈనాటికి అనేక ఆపదల అనంతరం మిమ్మల్ని చూడగలిగాం,'' అన్నాడు మహారాజు.

మహారాజు ఆజ్ఞ ప్రకారం మాలతి తెచ్చిచ్చిన ఆహారాన్ని మంచినీటినీ స్వీకరించి నరసింగభూపతి కొంచెం బలం చేకూర్చుకున్నాడు. అయినా పూర్తిగా నీరసం తొలగిపోలేదు.

మహారాజు యమదూత అయననెలా విడిపించి తీసుకు వచ్చిందీ నరసింగభూపతికి వివరించి చెప్పాడు. అనంతరం యమదూత అయన నడిగాడు.

"అసలు మంత్రి సాధు మిమ్మల్ని బంధించినప్పటినుంచి ఏమేం జరిగిందీ మీ నోటిద్వారా వినాలనుకుంటున్నాను."

రఘువీర్ మహారాజు వెంటనే అన్నాడు.

'అయనను ఇంతరాత్రివేళ బాధపెట్టి ఈ విషయాలన్నీ చెప్పించడం మంచిదికాదు. విశ్రాంతి తీసుకోనిద్దాం. రేపు బహుశా కళ్యాణి, నర్మద, భవానికూడా ఇక్కడికి రావచ్చు. రమ్మని నేను కబురంపాను."

"అందరూ క్షేమంగా ఉన్నారా? కళ్యాణి కూడా?" ఆతురతగా ప్రశ్నించాడు నరసింగభూపతి.

"అందరూ కుశలంగానే ఉన్నారు. రేపు అందరినీ కలుసుకోగలరు. ఈపూట విశ్రాంతి తీసుకోండి." అన్నాడు మహారాజు.

తర్వాత మిగిలిన రాత్రిని విశ్రాంతిగా గడపడానికి నిశ్చయించుకున్నారందరూ. తిరిగి అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

క్రమంగా తెల్లవారింది. వెలుగు రేఖలు అక్కడక్కడి నించీ భూగృహపు గదులలోకి ప్రసరిస్తున్నాయి. అందరూ

ఒక్కరొక్కరుగా నిద్రాదేవి కౌగిలినించి బయట పడ్డారు.

కాలకృత్యాల అనంతరం ఫలహారాలు ముగిసినాక అందరూ రఘువీర్ మహారాజు గదిలో సమావేశమయ్యారు. ఇంతలో ఒక భటుడక్కడికి వచ్చాడు.

"నర్మదగారు, భవాని వస్తున్నారు," అని తెలియచేశాడు ఆ భటుడు.

ఈ వార్త అందరికీ సంతోషాన్ని కలిగించింది. వాళ్ళని సగౌరవంగా తీసుకురావడంకోసం మాలతి హుషారుగా భటుని వెనుక పరుగెత్తింది.

కాసేపటికి నర్మదను, భవానిని, కళ్యాణిని వెంటపెట్టుకొని మాలతి గదిలో ప్రవేశించింది. తండ్రిని చూడగానే తనయులు ముగ్గురూ ఆనంద దుఃఖోద్వేగాలతో ఆయన కాళ్ళమీద పడ్డారు. నరసింగభూపతి ఆనంద భాష్పాలు ఒక చేత్తో తుడుచుకుంటూ రెండో చేత్తో కుమార్తెలను దగ్గరకు తీసుకున్నాడు.

కొంతసేపు మౌనంగా గడచిపోయింది. ఎంతోకాలం తర్వాత, ఎన్నో కష్టాల అనంతరం కలుసుకున్న ఆప్తులు మాట్లాడుకోవలసిన విషయాలు చాలా ఉన్నా ఎవరూ ముందుగా నోరు విప్పలేదు.

ఆ తర్వాత కుశల ప్రశ్నాదికాలు ముగిశాయి. అనంతరం యమదూత నరసింగ భూపతిని తన మామూలు ప్రశ్న అడిగాడు.

నరసింగభూపతి నెమ్మదిగా అన్నాడు.

"కళ్యాణిని పెళ్ళికి తీసుకువెళ్తున్న మామీదికి ఎవరో దుండగులు దండెత్తడం, అప్పుడు జరిగిన పోరాటంలో గాయపడి నేను క్రమంగా స్పృహ కోల్పోవడంవరకు నాకు తెలుసు. ఆ తర్వాత నాకు స్పృహ వచ్చేసరికి నేనొక చీకటి గదిలో ఉన్నాను. అలా ఆ గదిలో ఒకటి రెండు రోజు లున్నానేమో, ఆమరునాడు ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చారు. నన్ను విడిపించడానికి వచ్చినవాళ్ళనుకున్నాను. కాని అలా జరగలేదు. వాళ్ళు నన్ను తీసుకుపోయి, యమదూత నన్ను విడిపించిన ఆ అంధకార కూపంలో పడవేశారు. అప్పటినించీ ఇప్పటివరకు అక్కడే ఉన్నాను. ఒకసారిమాత్రం మంత్రి సాధు వచ్చినట్టు జ్ఞాపకం. అప్పుడే ఇదేదో కుట్ర అనీ, ఇందులో మంత్రి చెయ్యికూడా ఉందనీ నేను గ్రహించాను.

నరసింగభూపతి చెప్పడం ముగించాడు. ఆతర్వాత రకరకాల విషయాలు వాళ్ళ ఆనందమయ సంభాషణలలో దొర్లిపోయాయి. నర్మద, కిరణ్మయి, లావణ్యలకు హాని చేయడానికి తలపెట్టి ఖైదు నలంకరించిన మంథరను గురించీ, ఆనాటి సంఘటనను గురించి అందరికి చెప్పి వినిపించింది.

యమదూతకు అకస్మాత్తుగా ఏదో గుర్తుకొచ్చింది అతను మాలతివైపు తిరిగి ప్రశ్నించాడు.

"నేను నీకు పంపిన ఉత్తరాల పెట్టె ఇప్పుడెక్కడుందో నీకేమయినా తెలుసా?"

"ఆ సంగతి నాకు తెలియదు. నేను దానిని ఒక రహస్యస్థలంలో మా భవనంలో దాచాను. అక్కడినించి దాని

నెవరైనా అపహరిస్తే తప్ప లేకపోతే అది అక్కడే ఉండి ఉంటుంది," అని సమాధానమిచ్చింది మాలతి.

యమదూత సాలోచనగా అన్నాడు. "అయితే ఆపెట్టె అక్కడ ఉండిఉండదు."

"మరి ఏమౌతుంది?" మాలతి అడిగింది.

"నువ్వే చెప్పావుగా ఎవరైనా అపహరించవచ్చని—"

"కాని ఆ భవనంలోంచి దాని నపహరించడం సులభ సాధ్యంకాదు. పైగా ఆపెట్టె దాచినచోటు నాన్నగారికి తప్ప మరెవరికీ తెలియదు."

యమదూత బాబాజీవంక పరిశీలనగా చూశాడు.

"అదే పెట్టెను రాయదుర్గంలో నామీద ఆరోపించబడిన నేరంనుండి నన్ను కాపాడిన ఆ వ్యక్తి తీసుకువచ్చాడు. ఆయన అక్కడ అందరికీ చూపిన పెట్టె అదే. అయితే దాని నాయన తిరిగి తీసుకున్నాడు."

మాలతి అర్థంకాక ఓసారి బాబాజీవంక, మరోకసారి యమదూతవంక చూసింది.

బాబాజీ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"ఇక ఆ రహస్యాన్ని దాచి ప్రయోజనం లేదు. రాయదుర్గంలో యమదూతను కాపాడడానికి వచ్చింది నేనే. నా భవనంలో ఒంటరిగా దేనికోసమో వెదకుతుండగా ఆపెట్టె దొరికింది. అందులో ఏముందో చూడాలనిపించింది. దాని మూతను తెరచి అందులోంచి ఉత్తరాలను బయటికి లాగాను. అన్నిటినీ చదివాను. అనేక రహస్య విషయాలు నాకు తెలిశాయి. అప్పటినించి ఆపెట్టెను నా దుస్తులలోనే

ఉంచుకుంటున్నాను. యమదూత పై ఆరోపించబడిన నేరం విషయం ఎలాగో నాకు తెలిసింది. అతను అంతటి అపరాధి కాదని నాకు తెలుసు. అందుచేత అతనిని విడిపించడానికి ఆ వేషం ఉపయోగించాను ”

“ఆ పని మీరు మామూలు వేషంలోనే చెయ్యవచ్చుగా. వేషం మార్చుకోవడం దేనికి ?” యమదూత ఆశ్చర్యంగా అడిగాడు, మారు వేషంలో ఉన్న బాబాజీని కూడ తాను గుర్తుపట్టలేకపోయినందుకు సిగ్గుపడుతూ.

‘ మాలతిని ఎవరో అపహరించినప్పటినించి నేను ఆమె కోసం వెదకనారంభించాను. అయితే నాకు మాలతి జాడ తెలియలేదు కాని కళ్యాణి ఒక చోట బంధింపబడి ఉండగా చూసి ఆమెను విడిపించాను. తర్వాత నరసింగభూపతి ఎక్కడుందీ తెలుసుకుందామని ప్రయత్నించాను కాని లాభం లేకపోయింది. ఆ రోజునించి మామూలుగాను, మారు వేషాలలోను దేశమంతటా తిరుగుతూనే ఉన్నాను. ఆప్తులైనవారు ఆపదల్లో ఇరుక్కుంటే సహాయపడుతూ వచ్చాను.” బాబాజీ జవాబుగా అన్నాడు.

“నరసింగభూపతి వేషంలో ఉన్న వ్యక్తిని మీరా రోజు సమావేశంలో గుర్తుపట్టలేక పోయారా ?” యమదూత మళ్లీ అడిగాడు.

“గుర్తుపట్టలేకపోయాను,” అన్నాడు క్లుప్తంగా బాబాజీ.

అప్పటికి కొంచెం ప్రొద్దెక్కింది. మాట్లాడుకోవలసిన విషయాలు కూడా అంతగా కనిపించలేదు. ఎవరి పనుల మీద వాళ్లు వెళ్ళిపోయారు.

# 7

ఆ యువతి చీకటిలో ఒంటరిగా నడచి వెళ్తోంది. ముఖం మీద విచార రేఖలు స్పష్టంగా అగుపిస్తున్నాయి. కొంచెం బలహీనంగా కూడా ఉన్నట్టుంది. ఓపిక లేకపోయినా ఏదో పట్టుదలతో ఆమె వేగంగా ముందుకు సాగిపోతోంది.

రాయదుర్గం ముఖద్వారాన్ని చేరుకుందామె. ఒకసారి చీకట్లో తన చూపుల్ని ముందుకు పోనిచ్చింది. ప్రధాన ద్వారం దగ్గర కొందరు భటులు కాపున్నారు. అంతకు మించి ఆ చుట్టుపట్ల జనసంచారం ఏ మాత్రం లేదు.

ఆమె నెమ్మదిగా ముఖద్వారం దగ్గరికి నడిచింది. భటుల మీదికి తన చూపులు పోనిచ్చింది. భటులలో ఒకతను ముందుకు వచ్చాడు.

"ఎవరు నువ్వు?" అతను ప్రశ్నించాడు.

ఆమె బిగ్గరగా మాట్లాడవద్దని తనకి సంజ్ఞ చేసింది. అతను ముఖద్వారానికి మరింత దగ్గరగా వచ్చాడు. ఆమె నెమ్మదిగా అంది.

"దగ్గర్లో శత్రువులున్నారు. నేనెవరో బిగ్గరగా చెప్పడం మంచిదికాదు. తలుపులు తీస్తే నేనెవరినో, ఎందుకు వచ్చిందీ చెవిలో చెబుతాను."

అతనామె వంక సంశయంగా చూశాడు. ఆమె తన పెదవులమీదికి చిరునవ్వు తెప్పించుకుని అంది.

"నామీద అనుమానంగా ఉందా! పోనీ, తలుపులు తెరిచినందువల్ల మీకేమీ అపాయం కలగదుగా. స్త్రీనొక్క తను ఇంతమంది చేతుల్లోనుండి ఎలా తప్పించుకుపోగలను?"

ఆ భటుడికి కొంచెం ధైర్యం కలిగింది. తలుపులు తెరిచి ఆమె కడ్డంగా నిలబడ్డాడు. ఆమె అతనికి మరింత దగ్గరగా జరిగి చెవిలో రహస్యంగా అంది.

"నేను నర్మదగారి దగ్గరినించి వస్తున్నాను. ఒక ముఖ్య విషయం మంత్రవాదిగారికి చెప్పవలసిందిగా ఆమె నన్ను పంపింది."

ఈ మాటలు చెబుతూనే ఆమె తన చేతిలోని ఏదో వస్తువును ఎవరికీ కనిపించకుండా నేలమీదకి విసరింది. ఈ సంగతి ఎవరూ గమనించనే లేదు.

కాని కాసేపట్లో అక్కడున్న అందరు భటులూ స్పృహ కోల్పోయి నేలమీద ఒరిగారు. ఆమె ఓసారి తనలో తాను నవ్వుకుంది. జాగ్రత్తగా ఓసారి అటూ ఇటూ పరీక్షించి చూసి ప్రధాన ద్వారం తలుపులు మామూలుగా మూసింది.

అక్కడినించి ఆమె ఆ చీకటిలో చిత్రగృహంవైపు నడిచింది. దాదాపుగా అర్ధరాత్రివేళ కావడంవల్ల అందరూ గాఢనిద్రలలో మునిగిఉన్నారు. పైగా శత్రువులను గురించి ఆలోచించే సమయం కాదది. అందుచేత ప్రమత్తులై ఉన్నారందరూ.

ఆమె ఎలాగో చిత్రగృహంలోకి అతికష్టంమీద ప్రవేశించ గలిగింది. అన్ని గదులూ వరుసగా వెదికింది. ఒక గదిలో జయంత్ నియమించిన చిత్రగృహాధిపతి నిశ్చింతగా మైమరచి నిద్రపోతున్నాడు. అతనికి దగ్గరగా చిన్న నూనె దీపం వెలుగుతోంది.

తన దగ్గరఉన్న మరొక మత్తుగుండును ఆమె అతనికి దగ్గరగా విసిరింది. దాని ప్రభావంవల్ల అత నొకసారి కంపించి స్పృహాకోల్పోవడం ఆమె గమనించింది. వెంటనే అతని దగ్గరికి వెళ్ళి దుస్తులలో వెదకి తాళపు చెవుల గుత్తిని బయటికి లాగింది.

అక్కడినించి తిన్నగా ఖైదు గదులవైపు నడచింది. ఒక గది దగ్గర అకస్మాత్తుగా ఆగింది. గదిలోకి పరీక్షించి చూసింది. లోపల మహామాయ బంధించబడి ఉంది. ప్రక్కనే వెలుగుతున్న చిన్నదీపపు కాంతిలో ఆమె కూడా నిద్ర పోతున్నట్టు యువతి గ్రహించింది

తన దగ్గర ఉన్న తాళపు చెవుల గుత్తి సాయంతో ఆ గది తలుపులకు తగిలించి ఉన్న తాళం తీసి తలుపులు తెరచిందాయువతి. లోపలికి అడుగు పెట్టింది.

మహామాయ ఆ చప్పుడుకు ఉలిక్కిపడి లేచింది. తన తీవ్ర దృష్టిని ఆ యువతిమీదకి పోనిచ్చింది. కాని ఆమె ఎవరో గుర్తుపట్టలేక పోయింది.

బిగ్గరగా మాట్లాడకండి. మీ పక్షందానినే. మిమ్మల్ని విడిపించడానికి వచ్చాను. నాతోరండి," అందా యువతి.

మహామాయ ఆ యువతివంక ఆశ్చర్యంగా చూస్తూ లేచి నిలబడింది. ఆ యువతిమీద మహామాయకు కూడా అను మానం కలిగినా ఆమె అనుమానాన్ని అణచుకుంది. ఒకవేళ ఆ యువతి తనకు శత్రువే అయినా తాను ఇంతకంటే అథమ స్థితిని అనుభవించబోదుగా !

గదిలోంచి బయటికి రాగానే ఆ యువతి అంది.

"మంత్రిగారెక్కడ బంధింపబడి ఉందీ తెలియలేదు. ఈ చుట్టుప్రక్కల గదులలో మాత్రంలేరు. ఆయన కోసం వెదకి వస్తాను."

మహామాయ నెమ్మదిగా అంది.

"ఇప్పుడాయనకోసం వెదుకుతూ కూర్చుంటే ప్రయో జనంలేదు. ఎవరైనా ఈ లోపల మన విషయం పసిగట్ట వచ్చు. అందుకని ముందిక్కడినించి పారిపోవడం అవసరం. మంత్రి తన విషయం తాను చూసుకుంటాడులే"

ఆ యువతి ఏమీ అనలేదు. ఇద్దరూ గబగబా వెనక్కి తిరిగి నడిచారు.

సొరంగం చివరికి రాగానే ఆ యువతి అంది. "గోడ లోని ఈ రాతిని తొలగించగానే అక్కడ కాపుంచబడిన భటులు గొడవ చేస్తారు."

వెంటనే మహామాయ అడిగింది.

"అక్కడ భటులు కాపుంచబడ్డారా ?"

"ఔను. అందరికీ ఆ రహస్య మార్గం విషయం తెలిసిం దని అక్కడ కొందరు భటులను కాపుంచారు."

"ఐతే మనమేం చెయ్యాలి."

"నా దగ్గర మత్తుగుళ్లున్నాయి. మీరు ఈ రాతిపలకను నెట్టండి. నేను వెంటనే మత్తుగుళ్ళను బయటికి విసురుతాను. వాటి ప్రభావంవల్ల భటులు వెంటనే స్పృహ కోల్పోతారు. మనం పారిపోవచ్చు," ఆ యువతి అంది.

అనుకున్న ప్రకారం సులభంగా చిత్రగృహంలోంచి బయటపడ్డారా ఇద్దరూ. కాసేపట్లో స్మశానాలను దాటి దట్టమైన అడవిలో ప్రవేశించారు. వాళ్ళింకా వేగంగానే ప్రయాణం చేస్తున్నారు. వెనకనించి ఎవరైనా తరుముకు వస్తున్నారేమోనన్న భయంతో అప్పుడప్పుడూ వెనుతిరిగి చూస్తూనే ఉన్నారు.

చాలదూరం నడచి వెళ్ళింతర్వాత ఒక చెట్టు క్రింద కూలబడ్డారిద్దరూ. త్వరత్వరగా నడచి వచ్చారేమో బాగా అలసిపోయారు. ఆయాసం తీర్చుకుంటూ కాసేపటివరకు ఎవరూ మాట్లాడలేదు.

మహామాయ ఆ యువతివంక మళ్ళీ ఓసారి పరీక్షగా చూసింది. ఆమె ఉపయోగించిన మత్తుగుళ్ళను చూసినప్పటి నించీ మహామాయ కేదో అనుమానం కలిగింది. అయినా ఆ అనుమానం రూఢి పరచుకోడానికి అవకాశం చిక్కలేదు.

ఆ యువతి మహామాయ వంకచూసి మందహాసం చేసింది.

"నేనెవరో తెలుసుకోవాలని కుతూహలపడుతున్నట్టున్నారు. మీరు కూడా చివరికి నన్ను గుర్తుపట్టలేకపోయారన్నమాట."

అంటూ ఆ యువతి తన మారువేషాన్ని తొలగించింది. మహామాయ ఆశ్చర్యంగా ఆమెవంక చూసి ఆనందంలో మునిగిపోయింది.

"నిన్ను నేనుకూడా గుర్తుపట్టలేకపోవడం ఆశ్చర్యకరమైన విషయం మైత్రేయీ! ఇంతకాలం నువ్వెక్కడున్నావో నాకు తెలియడంలేదు. ఈ రోజు ఎలా ఊడిపడ్డావు?"

మైత్రేయి ఆమె ప్రశ్న విని నవ్వుతూ అంది.

"మంథర భవనంలో మనం మోసగించబడ్డాం. కపాలిలా వచ్చిన వ్యక్తి నిజంగా కపాలికాదు, మంత్రవాది అయి ఉంటాడు. ఈ విషయం నేను రూఢిగా చెప్పలేననుకో. అయినా మంత్రవాది నన్ను మోసగించి పాడుపడిన ఒక దేవాలయంలో బంధించడం నాకు బాగా తెలుసు. ఆ తర్వాత ఒకటి రెండు రోజులు తిండీ తిప్పలు లేకుండా నే నక్కడే పడిఉన్నాను. ఆ మరునాడు ఎవరో ఒక వ్యక్తి నేను బాధతో మూలగడం విని అక్కడికి వచ్చి నన్ను కాపాడాడు.

"అప్పటినించీ నేను మీ కోసం వెదకుతూనే ఉన్నాను. కాని కలుసుకోలేకపోయాను. చివరికిలాగో మీరు చిత్ర గృహంలో బంధింపబడి ఉన్న విషయం చెవుల బడింది. మీరు నా కిచ్చిన మత్తుగుళ్లసాయంతో మిమ్మల్ని విడిపించడానికి ప్రయత్నించసాగాను. చివరికీ రోజు నా ప్రయత్నం నెరవేరింది."

'అయితే అసలు కపాలి ఏమైనట్టు? మహామాయ అనుమానంగా అడిగింది.

"అదే నాకూ తెలియలేదు. ఒకవేళ అతనిని శత్రువులు బంధించి ఉండవచ్చు," అంది.

ఒక్క నిమిషం మౌనం వహించి మహామాయ అంది. "నువ్వు నాకు ఆపదల్లో చేస్తున్న సహాయాలు మరువరానివి. పరిస్థితులు సక్రమంగా ఉంటే నీకు ఎంతయినా ప్రతిఫలం ఇవ్వగలను."

మైత్రేయి గంభీరంగా అంది. "మొదటినించి మీ ఉప్పు తింటున్నదాన్ని. ఎటువంటి ఆపత్కర పరిస్థితులలోనైనా మీ వెంట ఉండి సాయం చేస్తానని మీకు ఇదివరకే హామీ ఇచ్చానుకదూ!"

మహామాయ కాసేపాగి అంది.

"ఇప్పుడు మనం ఇతరుల సహాయంకోసం ఆశించి ప్రయోజనంలేదు. ఈ పరిస్థితులలో మనం ఎవరినీ నమ్మకూడదు. అందుచేత చేయదల్చుకున్న పనులేమిటో ఒంటరిగానే చెయ్యాలి.

'ఇప్పుడేం చేద్దామని మీ ఉద్దేశం?"

"అదే నేనుకూడా నిన్నడగబోతున్నాను."

"నాకుమాత్రమేం తెలుసు. మీరే పని చెయ్యదలచుకున్నా మీకా పనిలో సాయంచెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను."

'అయితే మనం భూగృహం చేరుకోవాలి. రఘువీర్ మహారాజును అంతమొందిస్తే తప్ప మనం ఏ పనిచెయ్యడానికీ వీలుకాదు."

"అది అంత సులభమైన పని కాదనుకుంటాను," మైత్రేయి సందేహంగా అంది.

"నువ్వు కంగారుపడకు. భూగృహంలో రహస్యంగా ప్రవేశించగలిగితే ఎలాగయినా రఘువీర్ మహారాజును నేను పట్టుబెడతాను," మహామాయ ధీమాగా అంది.

మంత్రి సాధునుకూడా విడిపిస్తే ఈ సమయంలో మనకు సహాయంగా ఉంటాడు కదూ." మైత్రేయి మళ్లీ అంది.

"అది ఇప్పుడు మనం చెయ్యరాని పని; నేను విడిపించ పడిన విషయం తెలియగానే చిత్రగృహంచుట్టూ చాలా కట్టుదిట్టంగా కాపలా ఏర్పాటుచేస్తారు. అందువల్ల మనం ఆ ప్రాంతానికి వెళ్తే వాళ్ళ చేతుల్లో చిక్కక తప్పదు," మహామాయ అంది.

మైత్రేయి మాట్లాడలేదు. కాసేపటికి మహామాయ తిరిగి అంది.

"మంత్రిలేకపోయినా మన పనికేమీ ఇబ్బందిరాదు. మన కర్తవ్యాన్ని మనం పూర్తిచేసుకోగలిగిననాడు ఆయనను కూడా విడిపించడానికి ప్రయత్నించవచ్చు."

"అయితే మనం తిన్నగా భూగృహానికి బయలుదేరి పోదాం," అంది మైత్రేయి.

ఇద్దరూ అక్కడినించి బయలుదేరారు. ఇంకా తెల్లవార డానికి చాలాసేపు పడుతుంది. ఐనా వాతావరణం హాయిగా ఉంది. అడవిలో గాఢాంధకారంగా లేకపోయినా చీకటి గానే ఉంది. దారి అస్పష్టంగా కనిపిస్తోంది.

"భూగృహంలో ఇప్పుడెవరుంటున్నదీ నీ కేమైనా తెలుసా?" మహామాయ అడిగింది.

"సరిగా తెలియదు. మహారాజు మాత్రమే అక్కడ ఉంటున్నాడని విన్నాను," మైత్రేయి అంది.

"మనం వేషాలు మార్చుకుని మరీ భూగృహంలో ప్రవేశించడం మంచిది," మళ్ళీ అంది మహామాయ.

"అంతేకాదు. మనం భూగృహంలోకి మామూలు దారిని కాక కొండదారిని వెళ్ళడం శ్రేయస్కరం," మైత్రేయి అంది.

"కాని అక్కడినించి ముందుకు భవనంలోకి దారి మనకు తెలియదుగా."

"ఏవా ఫర్వాలేదు. మహారాజుగారి గదులన్నీ తెలుసు. ఆయన ఎప్పుడో ఒకసారి అటు రాకపోడు."

"సరే. అలాగే చేద్దాం," అని ఊరుకుంది మహామాయ.

ఇద్దరూ అడవిలో వేగంగా నడచి వెళ్తున్నారు. తమ కర్తవ్యం మంచిదైనా చెడ్డదైనా, దానిని నిర్వహించాలనే పట్టుదలతో వాళ్లు ముందుకు సాగిపోతున్నారు.

## 8

రాత్రి గంభీరంగా అన్ని ప్రక్కలా తన ప్రతాపాన్ని చూపుతోంది భూగృహంలో చీకటి దట్టంగా ఆవరించి ఉంది. గదులలో వెలుగుతున్న చిన్న చిన్న దీపాలు ఎక్కువ కాంతిని ఇవ్వలేకపోతున్నాయి. తెరచిఉన్న

తలుపుల గుండా వాటి కాంతి అక్కడక్కడా బయటికి ప్రసరిస్తోంది.

దాదాపుగా అర్ధరాత్రి. భూగృహంలో అందరూ గాఢ నిద్రలలో మునిగి ఉన్నారు. కళ్యాణి, నర్మద, భవాని ఒక గదిలో ఉన్నారు. మహారాజు గదిలో ఒంటరిగా పవ్వళించాడు. బాబాజీకి, మాలతికి ఒక గది ఏర్పాటు చెయ్యబడింది. అక్కడ ఇక మిగిలిఉన్న ఒక్క గదిలోను యమదూత, నరసింగభూపతి విశ్రమించారు. యమదూత తన అనుచరుడిని గుహకు వెళ్లి మిగిలిన అనుచరులకీ విషయాలు చెప్పమని పంపాడు.

యమదూతకు అకస్మాత్తుగా ఎందుకో మెలుకువ వచ్చింది. కళ్లు తెరచి నాలుగు ప్రక్కలా కలయచూశాడు. అతని దృష్టి గడపలోపల నిలబడి ఉన్న ఒక భటుడిమీద పడింది.

"ఏమిటి ? ఏం కావాలి ?" యమదూత అడిగాడు.

"మీ కోసం ఎవరో వచ్చారు," భటుడు సమాధానమిచ్చాడు.

"ఎవరో చెప్పలేదా ?"

"లేదు."

"ఎంతమంది ?"

"ఇద్దరు."

వాళ్ళిద్దరూ ఎవర్నా అని ఆలోచిస్తూ యమదూత మంచం మీదినించి లేచాడు. నెమ్మదిగా భటుడి వెనక బయలుదేరి వెళ్ళాడు.

ముఖద్వారందగ్గరికి వెళ్ళగానే కాపలా భటులవు ఎదురుగా ఇద్దరు ముసుగు వ్యక్తులు యమదూతకు కనిపించారు. ఆ ఇద్దరూ ఎవరో గుర్తు పట్టడానికి ఏ మాత్రం అవకాశం లేకుండా ఉంది.

యమదూతను చూడగానే అందులో ఒకతను తన వెనక రమ్మన్నట్టుగా సంజ్ఞ చేశాడు. వాళ్ళెవరో తెలియక పోయినా ఏదో విశేషం ఉండి ఉంటుందని వాళ్ళ వెనక బయలుదేరాడు యమదూత.

భూగృహానికి బయట ఉన్న భవనంలోకి ప్రవేశించారు ముగ్గురూ. చుట్టూ నిశ్శబ్దంగా ఉంది. భూగృహంలో అంత చీకటిగా లేదిక్కడ. యమదూత మళ్ళీ వాళ్ల వంక ఓసారి పరీక్షగా చూశాడు కాని గుర్తుపట్టడానికే మా ఆస్కారం అతనికి కనిపించలేదు.

హాలు వెనకఉన్న గదిలోకి తీసుకువెళ్లారా ఇద్దరూ యమదూతను. అక్కడ ఆగిపోగానే యమదూత అడిగాడు.

"మీ రెవరో, నన్నిక్కడి కెందుకు తీసుకువచ్చారో తెలుసుకోవాలనుకుంటున్నాను."

"ఆ విషయం చెప్పడానికేమీ అభ్యంతరం లేదు. అయితే ఈ విషయాలను నువ్వు రహస్యంగా ఉంచాలి," అందులో ఒక వ్యక్తి అన్నాడు.

గొంతునుబట్టికూడా యమదూత, వాళ్లెవరైందీ ఊహించలేకపోయాడు. ఇంతలో అందులో మొదటి వ్యక్తి ముసుగును తొలగించాడు. యమదూత అతని ముఖంకేసి ఆశ్చర్యంగా చూశాడు. అంతే. అతని ఒళ్లంతా ఒక్కసారిగా

గగుర్పొడిచింది. ఎందుకో కంగారు నరనరాలకు ప్రాకి నట్టయింది.

ఈ లోపల రెండవ వ్యక్తి కూడా తన ముసుగు తొలగించాడు. అతనిని చూసి యమదూత మరింత కంగారు పడ్డాడు.

"నాతో మీకిప్పుడేం పని?" యమదూత ఆతురతగా ప్రశ్నించాడు.

"మాకొక సహాయం చెయ్యాలి నువ్వు?"

"ఏమిటది?"

"ఆ సంగతి నెమ్మదిగా చెబుదాం. కాని సాయం చేస్తానని మాట ఇవ్వాలి."

యమదూత కాసేపాలోచించి దీనంగా అన్నాడు.

"ఇంతవరకు నేన నేక అపరాధాలు చేసి వాటి ఫలితాల ననుభవిస్తూ వాటినిప్పుడు సరిదిద్దుకోడానికి ప్రయత్నిస్తున్నాను తిరిగి. ఈ సమయంలో ఏదైనా నేరం చెయ్యడమంటే కావాలని ఆత్మహత్య చేసుకోవడం క్రిందే లెక్క."

"అపరాధం—అంటే ఎవరి దృష్టిలో? నువ్వు మాకు సహాయం చెయ్యబోతున్నావంటే అది మా దృష్టిలో అపరాధం కాబోదుగా," అంగుళం ఒక వ్యక్తి అన్నాడు.

"కాని నా దృష్టిలో అపరాధం అంటే నగేంద్రమహారాజుకు, ఆయన మిత్రులకు వ్యతిరేకంగా ఏ పనయినా చెయ్యడమే."

"సరే. ఆ విషయాలన్నీ ఎందుకు? మాకు నువ్వు చేసి పెట్టవలసిన పని చెబుతా విను. నరసింగభూపతిని నువ్వు మా కప్పగించాలి." అందులో మొదటి వ్యక్తి అన్నాడు.

ఈమాట వినగానే యమదూత పై ప్రాణాలు పైనే పోయినంత పనయింది. పిచ్చివాడిలా ఓసారి ఆ ఇద్దరివంకా చూశాడు. అతని తల తిరిగి పోసాగింది.

"ఏమంటావ్?" అందులో ఒకతను గర్జిస్తూ అడిగాడు.

"అనేదేముంది! నా ప్రాణాలమీదికి వస్తేనే నేను నరసింగభూపతిని వెదికి కష్టపడి పట్టుకువచ్చాను. తిరిగి ఆయనను మీ కప్పగించడంకంటే——"

యమదూత తన వాక్యం పూర్తి చెయ్యకముందే ఆ వ్యక్తి అన్నాడు.

"ఈ సంగతులన్నీ అనవసరం. ఇప్పుడు మాకు నరసింగ భూపతి కావాలి. ఆయనను నువ్వు మా కప్పగించాలి. లేకపోతే——"

మధ్యలోనే యమదూత కంగారుగా అన్నాడు.

"నా పరిస్థితినికూడా మీరు గమనించాలి. నరసింగ భూపతిని తీసుకువచ్చి నేను మీ కప్పగించడానికి ప్రయత్నిస్తాను. అయితే నేను చేసే నేరం బయటపడకుండా ఏదయినా ఉపాయం మీరు చెప్పాలి."

ఆ ఇద్దరు వ్యక్తులూ కాసేపు ఆలోచించారు.

"నువ్వు నరసింగభూపతిని రఘువీర్ మహారాజు కప్పగించి నీ కర్తవ్యం నిర్వహించుకున్నావ్. ఆ తర్వాత నరసింగ

భూపతి ఏమయినా నీకేం బాధ్యత లేదుకదా," ఒకత నన్నాడు యమదూతతో.

యమదూత మౌనం వహించి వినసాగాడు.

"అందుచేత నరసింగభూపతిని ఎవరో తస్కరించినట్టు నిరూపిస్తే నీ మీదికి ఏ నేరమూరాదు," మళ్ళీ అన్నాడతను.

"కాని ముఖద్వారం వద్ద ఉన్న కాపలా భటులు ఎలా ఊరుకుంటారు?" యమదూత అడిగాడు.

"వాళ్ల నెలాగైనా మోసగించడానికి ప్రయత్నించాలి," ఆ వ్యక్తి అన్నాడు.

"అదెలా సాధ్యమౌతుందనే నేను చూస్తున్నాను," అన్నాడు యమదూత.

ముగ్గురూ కాసేపాలోచించారు. కాని త్వరలో ఎవరికీ ఎటువంటి ఉపాయమూ తట్టలేదు

"ఏదో ఒక పద్ధతి ఆలోచించి నువ్వే ఈ పనిచెయ్యాలి," అన్నాడందులో ఒకతను మళ్ళీ.

"ఏదో ఒకటి — అంటే — నాకే ఉపాయమూ తట్టనప్పుడు నేనేం చెయ్యను?"

"అవన్నీ మా కనవసరం. మాకు కావలసింది నరసింగ భూపతి. ఆ పని చెయ్యవలసింది నువ్వు. చెయ్యకపోతే అందుకు ఫలితమేమిటో నీకు తెలుసు," రెండవ వ్యక్తి అన్నాడు.

యమదూత మళ్ళీ కాసేపాలోచించి అన్నాడు.

"నాకో ఉపాయం తట్టింది. మీలో ఒకరు నాతో పాటు రండి. ముఖద్వారం దగ్గరున్న భటులతో నా అను

చరుడని చెబుతాను నా గదిలోకి వెళ్ళింతర్వాత నిద్ర పోతున్న నరసింగభూపతికి స్పృహ లేకుండా చేస్తాను. ఆయన వేషం నాతో వచ్చిన వ్యక్తి వేసుకుని ఏదో పనిమీద బయటికి వెళ్తున్నట్టు భటులతో చెప్పి వెళ్ళాలి. ఆ తర్వాత నేనెలాగో నరసింగభూపతిని తీసుకువచ్చి మీ కప్పగిస్తాను."

"సరే. అలాగే. నీతో పాటు నేను వస్తాను," అన్నాడు అందులో మొదటి వ్యక్తి.

ఇద్దరూ తిరిగి సొరంగమార్గంలోకి ప్రవేశించి గదుల వైపు బయలుదేరారు.

భటులతో 'ఇతను నా ముఖ్యానుచరుడు. ఏవో విష యాలు రహస్యంగా మాట్లాడడానికి లోపలికి తీసుకు వెళ్తున్నాను" అన్నాడు యమదూత తన ప్రక్కనఉన్న వ్యక్తిని చూపిస్తూ.

భటులేమీ అభ్యంతర పెట్టలేదు. తన గదిలోకి వెళ్ళిం తర్వాత యమదూత గాఢనిద్రలోఉన్న నరసింగభూపతికి ఏదో మత్తుమందు వాసన చూపించి ఆయన స్పృహకోల్పో యేట్టు చేశాడు.

ఆ తర్వాత యమదూతతో పాటు వచ్చిన వ్యక్తి నరసింగ భూపతి వేషం వేసుకుని యమదూత చెప్పిన ప్రకారం ఒక్కడే వెళ్ళిపోయాడు.

రెండు నిమిషాలు గడచింతర్వాత యమదూత స్పృహ కోల్పోయి ఉన్న నరసింగభూపతికి తనతో పాటు వచ్చిన వ్యక్తి వేషం వేశాడు. అలాగే ఆయనను భుజాన వేసుకుని సొరంగ మార్గాన బయలుదేరాడు.

కాపలా భటులతో "మాట్లాడుకుంటున్న సమయంలో తన అనుచరుడికి అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చి పడి పోయాడనీ, బయట తమకోసం వేచి ఉన్న మరొక అనుచరుడికి అతనిని అప్పగించి వస్తాననీ," చెప్పాడు యమదూత.

అతని మాటలు నమ్మిన భటులు నిస్సంకోచంగా అతనిని బయటికి వెళ్ళనిచ్చారు. భవనంలోని ఆ గదిలో ప్రవేశించగానే ఆ ఇద్దరు వ్యక్తులతోను యమదూత అన్నాడు.

'ఎలాగో నరసింగభూపతిని మీ కప్పగిస్తున్నాను. కాని నేను చేసిన ఈ నేరాన్ని మాత్రం మీరు కప్పిపుచ్చండి."

వాళ్లు మౌనంగా తల ఊపి స్పృహ కోల్పోయి ఉన్న నరసింగభూపతిని భుజాన వేసుకుని బయటికి వెళ్ళిపోయారు. కాసేపట్లో చీకటిలో లీనమైపోయారు.

వాళ్లు కనిపించేంతవరకు వాళ్ళ వంక చూసి తర్వాత యమదూత వెనుతిరిగాడు. ముఖద్వారం దగ్గరికి రాగానే ఒక కాపలా భటు డతనిని అడిగాడు.

"మీరు బయటికి వెళ్లకముందే, నరసింగభూపతిగారు ఏదో అవసరమైన పనిమీద బయటికి వెళ్తున్నానని చెప్పి వెళ్ళారు. ఇంకా తిరిగి రానేలేదు. మీకు కనిపించారా?"

యమదూత ఆశ్చర్యంగా ముఖం పెట్టి అన్నాడు.

"నాకాయన ఎక్కడా కనిపించలేదే. నేను, నా అనుచరుడు లోపలికి వెళ్ళినప్పుడుకూడా ఆయన నిద్ర కేమైనా భంగం కలుగుతుందేమోనని బయట్నే మాట్లాడుకుంటూ కూర్చున్నాం. మేం గదిలోకి వెళ్లనే లేదసలు."

భటులు మాట్లాడలేదు.

"ఏదో పనిమీద బయటికి వెళ్లుంటారాయన. కాసేపట్లో తిరిగివస్తారేమో," అంటూ యమదూత తన గది వైపు వెళ్ళాడు.

మంచంమీద పడుకోగానే అతనికి గతమంతా ఒక్కసారి గుర్తువచ్చింది. కళ్ల వెంట నీళ్ళు వచ్చినంత పనయింది. తాను ఎంత కష్టపడి నరసింగభూపతిని విడిపించుకు వచ్చిందీ తనకు తెలుసు. ఇప్పుడు తిరిగి తానే స్వయంగా ఆయనను ఇతరుల కప్పగించాడు. ఇంతకూ దైవం తనకు వ్యతిరేకంగా ఉన్నాడు.

యమదూత ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు. క్రమంగా మగత నిద్ర అతని నావరించింది.

## 9

మహామాయ, మైత్రేయి కొండలబారును సమీపించక ముందే అడవిలోనే వేషాలను మార్చుకున్నారు. అక్కడి నించి కొండలవైపు నడక సాగించారు. మత్తుగుళ్లను అవసరానికి ఉపయోగించడంకోసం జాగ్రత్త పెట్టుకున్నారు.

ఎవరైనా చూస్తున్నారేమోనని ఓసారి నాలుగువైపులా చూసి ఎవరూ లేరని నిర్ణయించుకున్న తర్వాత కొండల వైపుకు వెళ్ళారిద్దరూ. నెమ్మదిగా సొరంగంలోకి వెళ్లి తలుపు మూసేశారు.

దగ్గరఉన్న ఒక కొవ్వొత్తిని వెలిగించింది మైత్రేయి. ఇద్దరూ గబగబా మెట్లు దిగుతూ వెళ్లి సొరంగ మార్గంలో

నడచిపోయారు. కాసేపట్లోనే ఒక గదిలోకి ప్రవేశించారు. ఒక క్షణం అక్కడ నిలబడి అటూ ఇటూ చూశారు.

అన్నివైపులా గంభీరమైన చీకటి. చీకటితో పాటు నిశ్శబ్దం. ఇద్దరూ ఆ ప్రశాంత వాతావరణంలో అక్కడ నిలబడి ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు. తర్వాత మైత్రేయి నెమ్మదిగా అంది.

"ఇటు కుడిచేతివైపు గదులన్నీ పరీక్షించి చూద్దాం. అవతలివైపుకు వెళ్ళడానికి ఎక్కడయినా మార్గం కనిపించవచ్చు."

ఆమె మాట ప్రకారం ఇద్దరూ కుడిచేతివైపుకు తిరిగారు. ఒక్కొక్క గది తలుపులు తెరచుకుంటూ గది గోడలవైపు పరీక్షగా చూస్తూ ముందుకు నడుస్తున్నారు. కాని ఎక్కడా ఎటువంటి మార్గమూ ఉన్న లక్షణాలు వాళ్ళకు కనిపించడం లేదు.

అలా రెండు మూడు గదులు దాటి పోగానే మైత్రేయి అకస్మాత్తుగా ఆగింది. ఆమె చెవులకు ఎవరో బాధగా మూలుగుతున్న ధ్వని వినిపించసాగింది. ఆమె మహామాయుడిని జాగ్రత్తగా వినమన్నట్లుగా సంజ్ఞ చేసింది.

మహామాయుడికు కూడా ఆ ధ్వని వినిపించింది. కాని ఆ ధ్వని ఎటునించి వస్తున్నదో ఆమెకు స్పష్టంగా తెలియ లేదు.

"ఈ ధ్వని ఏ గదిలోనించి వస్తోంది?" ఆమె మైత్రేయిని అడిగింది సందేహంగా.

''మనం వచ్చినవైపు గదులలో ఎవరూ కనిపించలేదుగా. అందుచేత ముందున్న గదులలోంచే ఈ ధ్వని వస్తోందను కుంటాను,'' అంది మైత్రేయి.

''ఎవరో దీనంగా మూలుగుతున్నారు.''

''బహుశా ఎవరో ఒక గదిలో బంధింపబడి ఉండవచ్చు.''

ఇద్దరూ ఆ గదిలోంచి తలుపు తెగచుకుని ప్రక్క గదిలో ప్రవేశించారు. మూలుగుతున్న ధ్వని మరింత స్పష్టంగా ఇప్పుడు వినిపించ సాగింది.

''ఈ ప్రక్క గదిలోనే ఎవరో ఉండి ఉంటారు,'' అంది మహామాయ.

మైత్రేయి చూపు గదితలుపుల మీదికి పోయింది. తలుపులకి తాళం వేసి ఉంది. ఇంతకుముందు తాము చూస్తూ వచ్చిన ఏ గదులకూ తాళం వేసిలేదు. మామూలుగానే తలుపులు తెరచుకుని తాము లోపలికి రాగలిగారు.

మైత్రేయి ప్రశ్నార్థకంగా చూసింది మాహామాయ వంక. ఆమెకూ ఏమీ తోచలేదు.

''తాళం ఎలా తెరవడమా అని నేను ఆలోచిస్తున్నాను,'' మైత్రేయి అంది.

ఒక్కసారిగా ఏదో గుర్తువచ్చిన దానిలా మహామాయ మైత్రేయి వంక చూసింది.

''నా దగ్గర రెండుమూడు తాళపు చెవులున్నాయి. నేను భూగృహంలో ఉన్నప్పుడు అత్యవసర సమయాల్లో వాటిని ఉపయోగిస్తుండేదాన్ని. వాటివల్ల నాకు తెలిసిన అన్ని గదుల తాళాలూ తెరచుకునేవి,'' ఆమె అంది.

"వాటిని బయటకు తియ్యండి. పరీక్షించి చూద్దాం," అంది మైత్రేయి.

మహామాయ తన దగ్గర ఉన్న ఒక చిన్న తాళపు చెవుల గుత్తిని బయటికి లాగి మైత్రేయి కిచ్చింది. మైత్రేయి వాటి సహాయంతో ఆ తాళం తెరవడానికి ప్రయత్నించింది.

చివరికామె ప్రయత్నం నెరవేరింది. ఒక తాళపు చెవి సాయంతో ఆమె తాళం తెరవగలిగింది. మహామాయ ఆతురతగా గదిలోకి అడుగు పెట్టింది. మైత్రేయి ఆమె ననుసరించింది.

ఒక మూలగా నేలమీదపడి మూలుగుతున్న కపాలిని చూడగానే ఇద్దరూ ఆశ్చర్యంగా ఆ ప్రక్కకు పరుగెత్తారు.

బలహీనంగా ఉన్న కపాలి, ఎవరో గదిలో ప్రవేశించడంతో తలెత్తి దీనంగా ఆ ప్రక్కకు చూశాడు. మహామాయను, మైత్రేయిని చూడగానే అతనికి కూడా చాలా ఆశ్చర్యం కలిగింది. అయితే అతను తన ఆశ్చర్యాన్ని వ్యక్త పరచలేకపోయాడు. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

కపాలి పరిస్థితిపై మహామాయకు జాలి కలిగింది. ఐనా తానేం చేయగలదు.

"నిన్నిక్కడ బంధించిందెవరు?" ఆమె కపాలిని అడిగింది.

కపాలి ఉన్న బలాన్నంతా గొంతులోకి తెచ్చుకుని నెమ్మదిగా అన్నాడు,

"నీ దగ్గరినించి కిరణ్మయి, లావణ్యాలను విడిపించవలసిందిగా ఉత్తరం తీసుకువచ్చిన యమదూత చివరికి మిమ్మల్ని, నన్ను కూడా మోసగించాడు."

"అతనే నిన్నిక్కడికి తీసుకువచ్చి బంధించాడా?" మహామాయ మళ్ళీ అడిగింది.

"అతను బంధించలేదు. కాని అతని మూలంగానే నేను బంధించబడ్డాను. అతను చెప్పిన ప్రకారం వినమని మీరు నాకు ఉత్తరంలో వ్రాశారు. నేనలాగే చేశాను. కాని ఆ రాత్రి ఏం జరిగిందీ నాకు తెలియలేదు. పైగా ఒక ముసుగు వ్యక్తి నన్ను తీసుకువచ్చి ఇక్కడ బంధించాడు," కపాలి సమాధానమిచ్చాడు.

"ఐతే నిన్ను బంధించింది రఘువీర్ మహారాజు ఐఉండాలి," మహామాయ అంది.

కపాలి ఆశ్చర్యంగా అడిగాడు.

'ఆయన బ్రతికి ఉన్నారా?"

మహామాయ చిరునవ్వు నవ్వింది.

"ఆయన బ్రతికే ఉన్నాడు. ఇప్పుడాయన మనకు శత్రువు. ఆయనను హతమార్చడానికే మేమిక్కడికి వచ్చాం," ఆమె అంది.

"నేనెక్కడ బంధింపబడి ఉందీ కూడా నాకు తెలియడంలేదు," కపాలి అన్నాడు.

"భూగృహంలో ఇది ఒక రహస్యప్రాంతం. దీన్ని గురించి నిన్న మొన్నటి వరకు నాకూ తెలియదు. ఇప్పుడే తెలిసింది," మహామాయ అంది.

"అయితే దీని సంగతి రఘువీర్ మహారాజుకు ముందే తెలుసన్నమాట !"

"దీని సంగతే కాదు. భూగృహానికి సంబంధించిన ఇంకా అనేక రహస్య విషయాలు ఆయనకు తెలుసు."

మహామాయ తన మాటలు పూర్తి చేసే సరికి ఏదో చప్పుడు ప్రక్కనించి వినిపించింది. అందరి చూపులూ అకస్మాత్తుగా ఆ ప్రక్కకు తిరిగాయి. ఎదురుగా ఉన్న గది తలుపులు తెరచుకున్నాయి. అందులోంచి ఇవతలి గదిలోకి అడుగుపెట్టిన వ్యక్తి వంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి పోయింది మహామాయ.

"రఘువీర్ మహారాజు," అన్నమాట తెలియకుండానే మైత్రేయి నోటిగుండి వెలువడింది. కపాళి చూపులు మళ్ళీ ఆ ప్రక్కకు తిరిగాయి.

ఎదురుగా నిలబడి పరిహాసంగా నవ్వుతున్న రఘువీర్ మహారాజును చూసి మహామాయ ఒక్క క్షణం కంపించినా వెంటనే ధైర్యం తెచ్చుకుంది.

ఆమె కనిపించకుండా విసరిన మత్తుగుండు రఘువీర్ మహారాజు వెంటనే స్పృహ కోల్పోయేట్టు చేసింది. ఈ సంఘటన ముగ్గురికీ ఎంతో ఆనందం కలిగించింది.

మైత్రేయి నేలమీద కొరిగిన రఘువీర్ మహారాజు దగ్గరికి వెళ్ళింది. ఆయన దుస్తులలో వెదకింది గాని ఏమీ లభించలేదు.

'అడబోయిన తీర్థం ఎదురైనట్టుగా ఈయన మనకిక్కడే ఎదురయ్యాడు," అంది మైత్రేయి.

"ఇదివరకు కొంచెం దయ తలచడంవల్లనే మనకు విపత్కర పరిస్థితు లేర్పడినాయి. ఇప్పుడిక ఈయనను నిర్మొహమాటంగా కత్తి కెర చెయ్యడమే మంచిది," మహామాయ మైత్రేయి వంక చూసి అంది.

మహామాయ మనస్సులోని విచారం క్షణంలో తొలగి పోయింది. ఇన్ని కష్టాల ననుభవించినా చివరికి రఘువీర్ మహారాజును స్వాధీనం చేసుకోవడంవల్ల అనుభవించిన ఆపద లన్నీ ఆమె మనస్సులోంచి తొలగిపోయాయి. ఆమె కాసేపు నిశ్చలంగా ఆ గదిలో కళ్ళు మూసుకు నిలబడింది.

## 10

నరసింగభూపతి కనిపించకపోవడంతో భూగృహంలో మళ్ళీ కోలాహలం చెలరేగింది. ఆయన ఏదో పనిమీద బయటికి వెళ్తున్నానని చెప్పి వెళ్ళాడని భటులన్నారు.

యమదూత మహారాజు ప్రశ్నకు జవాబుగా ఇలా అన్నాడు.

"రాత్రి నా అనుచరులిద్దరు కొన్ని రహస్య విషయాలు మాట్లాడడానికి వచ్చారు. నేను వాళ్ళతో మాట్లాడుతూ ఉండగా నరసింగభూపతి ఎక్కడికో వెళ్ళి ఉంటాడు. భటులద్వారా ఆయన ఏదో పనిమీద బయటికి వెళ్ళాడని తెలిసింది. అయితే కాసేపటిలో తిరిగి వస్తాడుగదా నేను మళ్ళీ నిద్ర కుపక్రమించాను."

నర్మద వగైరాలకు ఈ సంఘటన చాలా విచిత్రంగా కనిపించింది. చాలాకాలం తర్వాత క్రితంరోజే శత్రువుల

ఖైదునుండి విడిపించి తేబడిన తమ తండ్రికి ఎవరితోనూ చెప్పరానంతటి రహస్య కార్యాలేమివచ్చాయో వాళ్ళకర్థం కాలేదు.

బాబాజీకి కూడా అంతా వింతగా ఉంది. అయితే ఇందులో ఏదో గూడుపుఠాణీ ఉండి ఉండాలని నిర్ణయించుకున్నాడాయన. కాని నరసింగభూపతి ఎక్కడికి వెళ్ళింది మొదలైన విషయాలను గురించి ఆయన కూడా ఆలోచించి ఒక నిర్ధారణకు రాలేకపోయాడు.

రఘువీర్ మహారాజు అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనకు కొంత విచారించాడు. నరసింగభూపతి ఒంటరిగా బయటికి వెళ్ళాల్సినంత అవసరం ఆయనకేమీ కనిపించలేదు.

ఒంటరిగా గదిలో కూర్చుని ఆయన ఆలోచించసాగాడు. ఆయన మనస్సులో రకరకాల ఆలోచనలు పరుగులెత్తుతున్నాయి. ఈ పరిస్థితులలో భూగృహంలో ఉన్న ఎవరినీ అనుమానించడానికి ఆస్కారం ఆయనకు కనిపించడం లేదు.

ఇంతలో యమదూత ఆ గదిలోకి వచ్చాడు.

“నరసింగభూపతిని గురించి మీరు విచారించకండి. ఆయన తిరిగి శత్రువుల చేతిలో చిక్కాడేమోనని నా అనుమానం. అందుచేత తిరిగి నా అనుచరుల సాయంతో ఆయన జాడ తెలుసుకోడానికి నేను ప్రయత్నిస్తాను. ఒక వారం రోజుల్లో ఆయన ఎక్కడ ఉన్నా సరే మళ్ళీ ఇక్కడికి తీసుకు వస్తాను,” అన్నాడు మహారాజుతో.

ఆయన తలెత్తి యమదూతవంక చూశాడు,

"అలాగే చెయ్యి. ఈ సందర్భంలో నీకే విధమైన సహాయం కావలసినా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. ఎలాగైనాసరే తిరిగి నరసింగభూపతిని ఇక్కడికి తీసుకు రావాలి."

యమదూత ఇంకేమీ మాట్లాడలేదు. ఆ గదిలోంచి నెమ్మదిగా బయటపడ్డాడు. బాబాజీతోగాని ఇతరులతో గాని ఏమీ మాట్లాడలేదు. భూగృహంలోంచి బయటికి వచ్చేశాడు. అక్కడినించి తిన్నగా తన గుహవైపు ప్రయాణం సాగించాడు.

యమదూత వెళ్లిపోయిన కాసేపటివరకు రఘువీర్ మహారాజు తన గదిలోనే కూర్చున్నాడు. తర్వాత అక్కడినించి సారంగ మార్గాన బయలుదేరాడు. ఆయన బయటికి వచ్చేసరికే అక్కడినించి యమదూత వెళ్లిపోయాడు.

ఆయన భవనంలో నిలబడి అటూ ఇటూ పరీక్షించ సాగాడు. ఇంతలో ఒక వ్యక్తివచ్చి ఆయన కెదురుగా నిలబడ్డాడు ఆ వ్యక్తి మాత్రం మహారాజుకు తెలియలేదు. అతని నెప్పుడు ఇంతకుముందు చూసిన జ్ఞాపకంలేదు.

"ఎవరు నువ్వు? ఇక్కడికెందుకు వచ్చావు?" ఆయన ప్రశ్నించాడు.

ఆ వ్యక్తి మందహాసం చేస్తూ మహారాజు కేదో సంజ్ఞ చేశాడు. ఆయన కూడా చిరునవ్వు నవ్వి తనతోపాటు రమ్మన్నట్టు సైగచేశాడు.

ఇద్దరూ తిరిగి లోపలికి ప్రవేశించారు. గదిలోపలికి వెళ్ళిం తర్వాత మహారాజు ఆ వ్యక్తి కొక ఆసనం చూపిం

చాడు. అతను దానిమీద కూర్చుని ఓసారి చుట్టూ చూశాడు.

"ఏమిటి విశేషాలు?" మహారాజు ప్రశ్నించాడు.

"ఒక ముఖ్యమైన విషయం చెప్పడానికి నేనిక్కడికి వచ్చాను."

"ఏమిటది?"

"మహామాయ, మైత్రేయి రహస్యమార్గం ద్వారా భూగృహంలో ప్రవేశించారు."

ఈ మాట వినగానే ఆశ్చర్యపడుతూ మహారాజు మళ్ళీ ప్రశ్నించాడు.

"మహామాయ చిత్రగృహంలో బందీగా ఉందికదూ!"

"ఆమెను మైత్రేయి విడిపించి ఉండవచ్చు."

"అయితే సాధుకూడా వాళ్ల వెంట ఉండాలిగా!"

"లేదు. అతను మాత్రం నాకు కనిపించలేదు. ఈ ఇద్దరే భూగృహంలో ప్రవేశించారు."

మహారాజు ఆలోచిస్తూ కాసేపటివరకు మాట్లాడలేదు. ఆ వ్యక్తి మళ్లీ అన్నాడు.

"ఆ ఇద్దరూ మారువేషాలలో ఉన్నారు. సారంగంలో ప్రవేశించే ముందే అడవిలో వేషాలు మార్చారు"

మహారాజు అకస్మాత్తుగా లేచాడు. "నువ్విక్కడే ఉండు. నేనిప్పుడే వస్తాను," అని ఆ వ్యక్తితో చెప్పి అక్కడినించి ఎక్కడికో వెళ్ళాడు.

ఆ వ్యక్తి అక్కడ ఉన్న గదులవైపు పరీక్షించి చూస్తూ ప్రశాంతంగా కూర్చున్నాడు. కొంతసేపటికి మహారాజు అక్కడికి తిరిగి వచ్చాడు.

"నువ్వు ఇక్కడే విశ్రాంతి తీసుకుంటూ ఉండు. నేను ఆ దుర్మార్గులకి తగిన శాస్తి చేసి వస్తాను," అన్నాడాయన ఆ వ్యక్తితో.

ఆ వ్యక్తి అంగీకారసూచకంగా తల ఊపాడు. మహారాజు మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయాడు. సొరంగాల కూడలినించి ఎడమవైపుకు తిరిగాడు. సింహపు విగ్రహం నోటిలోంచి క్రింద ఉన్న గదులలోకి వెళ్ళాడు. అక్కడినించి తిన్నగా కపాలి బంధింపబడి ఉన్న గది దగ్గరికి చేరుకున్నాడు.

ఆయన కాసేపు గది బయట నిలబడ్డాడు. లోపలినించి ఏవో సంభాషణలు ఆయనకు వినిపిస్తున్నాయి. కొంచెంసేపు ఆ సంభాషణలను వింటూ అక్కడే ఉండిపోయాడు.

అకస్మాత్తుగా ఆయన ముఖం కోపంతో ఎర్రబడింది. పెద్ద చప్పుడుచేస్తూ గది తలుపులు తెరిచాడు. ఒక్కడుగు ముందుకు వేసి వికటంగా నవ్వుతూ నిలబడ్డాడు.

గదిలోపల ఉన్న కపాలి, మహామాయ, మైత్రేయి కంగారుగా అటు చూశారు. అంతే. ఆశ్చర్యంగా ఒక్కసారి నోరు తెరిచారు.

మహామాయ చేతిలో చిన్న కత్తి మెరుస్తోంది. ఆమె తన దగ్గరగా నేలమీద పడిపోయిఉన్న వ్యక్తివంక, తలుపులు నెట్టి ముందుకు వచ్చిన వ్యక్తివంక ఆశ్చర్యపోతూ చూడసాగింది.

కపాలి, మైత్రేయి కంగారు పడిపోయారు. మహామాయకు దగ్గరగా నేలమీదపడి ఉన్న వ్యక్తి రఘువీర్ మహారాజు అనుకున్నారు వాళ్ళు. అయితే ఇప్పుడు వచ్చిన వ్యక్తి ఎవరు? ఈయనకూడా రఘువీర్ మహారాజులాగే ఉన్నాడు.

గదిలో అడుగు పెట్టిన రఘువీర్ మహారాజు బిగ్గరగా నవ్వుతూ మహామాయతో అన్నాడు.

"ఇద్దరు మహారాజుల్ని చూసి కంగారు పడిపోతున్నావా? ఇందులో అసలు మహారాజు ఎవరో తేల్చుకోవడం నీకు చాలా కష్టంగా ఉన్నట్టుంది."

మహామాయ మాట్లాడలేదు. ఈ విచిత్ర సంఘటన తిరిగి ఆమె మనస్సులో కలవరాన్ని లేపింది. ఆమె పిచ్చిదానిలా ఇద్దరికంకా చూస్తూ ఉండిపోయింది.

కపాలి అసలే బలహీనంగా ఉన్నాడు. అతని మనస్సు ఈ పరిస్థితిలో ఆలోచించడం మానేసింది. మైత్రేయి ఆ కంగారులో ఏం చెయ్యాలో నిర్ణయించుకోలేకుండా ఉంది.

"అయనను చంపడానికి సిద్ధపడ్డావు కదూ! చంపు," రఘువీర్ మహారాజు ఇంకా బిగ్గరగా నవ్వుతూ పరిహాసంగా అన్నాడు మహామాయతో.

మహామాయ మరొకసారి తన దగ్గరగా పడి ఉన్న మహారాజువంక చూసింది. అగమ్యగోచరంగా ఉన్న ఈ పరిస్థితులలో ఆమెకొక్కటే ఉపాయం తట్టింది. ఆ మత్తు గుండు సాయంతో మహారాజు వేషంలో ఉన్న రెండో వ్యక్తినికూడా స్పృహ తప్పిపోయేట్టు చెయ్యాలి. అప్పుడు

అసలు మహారాజు ఎవరో తెలుసుకోడానికి వీలు చిక్కుతుంది.

ఆమె ఒక మత్తుగుండును చాటుగా చేతిలోకి తీసుకుంది. ఇంతలో మళ్ళీ వికటాట్టహాసం ఆమెకు వినిపించింది.

"నీ మత్తుగుళ్ళు నా దగ్గర పనిచెయ్యవు. వాటిని క్రింద పారవెయ్యి."

ఈ మాట విన్న మహామాయ తేలుకుట్టిన దొంగలా అయిపోయింది. చేతిలోని మత్తుగుండును క్రిందికి వదలి తలుపు దగ్గర నిలబడిన రఘువీర్ మహారాజువంక పిచ్చిదానిలా చూస్తూ ఉండిపోయింది.

కాసేపు ఆ గదిలో గంభీరమైన నిశ్శబ్దం ఆవరించింది.

—: o :—

ఆ ఇద్దరు వ్యక్తులలో అసలు
రఘువీర్ మహారాజు ఎవరు ?
ఈ వింత పన్నాగంలోని
రహస్యమేమిటి? మహామాయ
పరిస్థితి ఎలా పరిణమించింది ?
తర్వాత ఏం జరిగింది ? మొద
లైన విషయాలు మహామాయ
పదహారవ పుస్తకం 'రణ
రంగం'లో చదవండి—

మహామాయ—15 కొంచెం ఆలస్యంగా వెలువడినందుకు పాఠకులు, ఏజెంట్లు క్షమించగలరు. ఇక ముందు పుస్తకాలు మామూలు ప్రకారం ప్రకటించిన తేదీలకు తప్పక వెలువడగలవు.

మహామాయ—16

## రణరంగం

ఏప్రిల్ 15 వ తేదీన వెలువడుతుంది

మహామాయ—17

## చాకచక్యం

ఏప్రిల్ 30 వ తేదీన వెలువడుతుంది

ఏజెంట్లు మరింత శ్రద్ధవహించి పైన ప్రకటించిన తేదీలకు లోపే డబ్బు పంపవలసిందిగా కోరుతున్నాం.

[illegible] మాస పత్రికకు, సీరియల్ కు సమర్థులైన ఏజెంట్లు డిపాజిట్లు కట్టవచ్చును.

విజ్ఞాన సాహితి

టి. నగర్ :: మద్రాసు-17

మొదటి సంచికతోనే ఏజెంట్ల, పాఠకుల
అభిమానాన్ని చూరగొన్న




తెలుగు డైజెస్ట్ మాస పత్రిక

'మే' నెల సంచిక ఏప్రిల్ నాలుగవ వారంలోనే
**వెలువడుతుంది.**

మహాభారతం సీరియల్; డిటెక్టివ్ అండ్ మిస్టరీ
కథలు, సాంఘిక హాస్యకథలు, విజ్ఞాన వినోద
గాథలు.—అద్భుతమైన త్రివర్ణ
ముఖచిత్రం

వెల :: 40 నయాపైసాలు

**ఏజెంట్లు వెంటనే ఆర్డర్లతో సొమ్ము పంపాలి.**

విజ్ఞాన సాహితి
టి. నగర్ :: మద్రాసు-17.

మహామాయ 15

∴

కోలాహలం

తెలుగు పాఠకులు బహు విధాలుగా ప్రశంసిస్తున్న మహామాయ, డిటెక్టివ్ అండ్ మిస్టరీ సీరియల్ నవలలో ఇది పదిహేనవ పుస్తకం. పాఠకులు ఊహించలేనంతటి విచిత్ర సంఘటనలతో ఈ కథ ముందుకు సాగిపోతోంది. ఇక ముందేమిజరుగుతుందో ముందుగా నాలుగు వాక్యాల్లో మాకు వ్రాస్తే హృదయారాటం తీర్చుకుంటాం అని వ్రాస్తున్నారు కొందరు పాఠకులు. కాని కొంచెం ఓపిక పట్టి అన్ని పుస్తకాలు వెలువడిన వెంటనే చదవడం బాగుంటుందని మా అభిప్రాయం. పాఠకులు ఇంతగా తహతహలాడి పోయేట్టు చేస్తున్న ఈ సీరియల్ లోని విశేషమేమిటో తెలుసుకోవాలంటే మీరూ ఈ నవలలోని భాగాలను మొదటినించి చదవండి. చదివి ఆనందించండి.

A VIGNANA SAHITI Publication in Telugu